పత్రికతో.. మార్పులు
APTEL/25/A1880
TN తెలుగు న్యూస్
దిన పత్రిక
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..
సంపుటి : 1 సంచిక : 707 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శుక్రవారం 04.09.2026 పేజీలు : 8 వెల : 4/-

## అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో

# మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు

### వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో కనిపించని మంత్రి నిమ్మల ఫొటో

- నిమ్మల ఫొటోను ముద్రించకపోవడాన్ని తప్పుబట్టిన చంద్రబాబు
- భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదని ఆదేశం



అమరావతి, సెప్టెంబర్ 3 : ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వానికి సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో, అత్యంత సంక్లిష్టమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పనులను సమర్థవంతంగా పూర్తి చేసిన జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ అధికారుల సమన్వయాన్ని సీఎం అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యం ప్రాజెక్టుల వద్దే ఉంటూ, ఎంతో నిరాడంబరతతో పనిచేస్తూ ఫలితాలు సాధిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటవుతోందని చెప్పారు. ఆంధ్ర పాప్‌కార్న్, అరకు కాఫీ ఉత్పత్తులను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో తీవ్రరూపం దాలుస్తున్న ఎల్‌నినో పరిణామాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. గడిచిన 30 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత స్వల్ప వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం మేర తీవ్ర వర్షపాత లోటు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఈరోజే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకూడదని, భూగర్భ జలాల ఆధారంగా అవసరమైతే అదనపు బోర్లు వేసేందుకు తక్షణ అనుమతులు ఇవ్వాలని అన్నారు.



## అక్టోబర్ నెలలోనే

# స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

- రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్
- స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి
- ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ

రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ,

తరువాయి 2లో

## 2027 వరకు ఎల్‌నినో ముప్పు

# భారత్‌కు WMO హెచ్చరిక




- 100 శాతం కొనసాగింపు అవకాశముందని డబ్ల్యూఎంఓ అంచనా
- 2026 చివరికి తీవ్ర స్థాయికి చేరే అవకాశం
- పసిఫిక్ సముద్రంలో అసాధారణ వేడి
- భారత్‌లో ఇప్పటికే 16 శాతం వర్షపాతం లోటు
- దేశంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం
- వ్యవసాయం, నీటి వనరులపై ఒత్తిడి ముప్పు

2లో



## జైశంకర్‌తో భేటీ..

# భారత్‌కు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు!

- జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ
- యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ
- భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ
- బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ
- శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు

2లో

# నేపాల్‌లో జల ప్రళయం..

## బురదలో కూరుకుపోయిన పవర్ స్టేషన్



- నేపాల్‌లో వరదలకు జెప్రే పవర్ సబ్ స్టేషన్ పూర్తిగా ధ్వంసం
- బురదలో కూరుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, యంత్ర పరికరాలు
- వివిధ ప్రాజెక్టుల వద్ద 900 మంది కార్మికుల ఆచూకీ గల్లంతు
- సహాయక చర్యల్లో పాల్గొంటున్న భారత్, చైనా బృందాలు
- జల విద్యుత్‌పై ఆధారపడిన నేపాల్ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర దెబ్బ

2లో

## నల్సార్ వివాదం

# BCIకి సుప్రీం షాక్



- న్యాయ విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐని ఆహ్వానించడాన్ని వ్యతిరేకించిన విద్యార్థులు
- నల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థులను ఎన్‌రోల్ చేయవద్దని బీసీఐ చైర్మన్ ఆదేశం

2లో

## అంతరిక్షం నుంచి పహారా

# ఇస్రో 'ఈవోఎస్05' ప్రయోగం

- సెప్టెంబర్ 4న ఈఓఎస్-05 ప్రయోగం
- తెల్లవారుజామున 2.55 గంటలకు లాంచ్
- జీఎస్ఎల్‌వీ-ఎఫ్17తో ఉపగ్రహ ప్రయోగం
- దాదాపు 36 వేల కి.మీ. ఎత్తులో నిఘా
- సరిహద్దులు, తీరాలపై నిఘాకు ఉపయోగం



ఢిల్లీ : దాదాపు ఎనిమిది నెలల విరామం తర్వాత ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. వరుసగా రెండు పీఎస్ఎల్‌వీ ప్రయోగాలు విఫలమైన నేపథ్యంలో.. ఈసారి జీఎస్ఎల్‌వీ ఎఫ్17తో ప్రతిష్ఠాత్మక మిషన్‌ను చేపట్టనుంది. సెప్టెంబర్ 4న తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ మిషన్‌లో ఈఓఎస్05 ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను అంతరిక్షంలోకి పంపనున్నారు. భూమికి దాదాపు 36 వేల కిలోమీటర్ల ఎత్తులో పనిచేసే ఈ ఉపగ్రహం.. భారత్‌కు ఆకాశం నుంచి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుంది. దేశ భూభాగం, తీరప్రాంతాలు, వాతావరణ వ్యవస్థలు, విపత్తులకు గురయ్యే ప్రాంతాలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఇది ఉపయోగపడుతుంది. హై రిజల్యూషన్ కెమెరా ద్వారా సరిహద్దుల భద్రతకు కూడా తోడ్పడనుంది.

తరువాయి 2లో

# ఏపీ, తెలంగాణలో వానలు

## అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక

- తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడి
- 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- ఏపీలో సెప్టెంబర్ 5 వరకు వర్షాలు కురిసే అవకాశం
- బంగాళాఖాతంలోకి మత్స్యకారులు వెళ్లవద్దని హెచ్చరిక



2లో

# అంతరిక్షం నుంచి పహారా: ఇస్రో 'ఈవోఎస్-05' ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

దాదాపు ఎనిమిది నెలల విరామం తర్వాత ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. వరుసగా రెండు పీఎస్ఎల్వీ ప్రయోగాలు విఫలమైన నేపథ్యంలో.. ఈసారి జీఎస్ఎల్వీఎఫ్17తో ప్రతిష్ఠాత్మక మిషన్‌ను చేపట్టనుంది. సెప్టెంబర్ 4న తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ మిషన్‌లో ఈఓఎస్05 ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను అంతరిక్షంలోకి పంపనున్నారు. భూమికి దాదాపు 36 వేల కిలోమీటర్ల ఎత్తులో పనిచేసే ఈ ఉపగ్రహం.. భారత్‌కు ఆకాశం నుంచి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుంది. దేశ భూభాగం, తీరప్రాంతాలు, వాతావరణ వ్యవస్థలు, విపత్తులకు గురయ్యే ప్రాంతాలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఇది ఉపయోగపడుతుంది. హై రిజల్యూషన్ కెమెరా ద్వారా సరిహద్దుల భద్రతకు కూడా తోడ్పడనుంది. ఈఓఎస్05ను సబ్‌జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టేలా మిషన్‌ను రూపొందించారు. జియోసింక్రోనస్ ఆర్బిట్ నుంచి పనిచేసే తొలి భారతీయ ఇమేజింగ్ శాటిలైట్‌గా ఈఓఎస్05 ప్రత్యేకత సాధించనుంది. దీని ప్రయోగ బరువు సుమారు 2,367 కిలోలు. ఈ ప్రయోగానికి ఉపయోగిస్తున్న జీఎస్ఎల్వీఎఫ్17 రాకెట్ 51.7 మీటర్ల ఎత్తు ఉంటుంది. లిఫ్టాఫ్ సమయంలో దాని బరువు 420.5 టన్నులు. మూడు దశలతో రూపొందిన ఈ రాకెట్‌లో 4 మీటర్ల వ్యాసం ఉన్న పేలోడ్ ఫెయిరింగ్ ఉంటుంది. మొదటి దశలో భారీ ఎస్139 ఘన ఇంధన మోటార్‌తో పాటు నాలుగు ద్రవ ఇంధన బూస్టర్లు పనిచేస్తాయి. ఎస్139లోనే 138 టన్నుల ఘన ఇంధనం ఉంటుంది. నాలుగు బూస్టర్లలో కలిపి సుమారు 170 టన్నుల యూహెచ్25, నైట్రోజన్ టెట్రాక్సైడ్ ఇంధనాలు ఉంటాయి. రెండో దశలో ద్రవ ఇంధన సాంకేతికతను ఉపయోగించారు. ఇందులో 42 టన్నుల యూహెచ్25, డైనైట్రోజన్ టెట్రాక్సైడ్ ఉంటాయి. చివరి దశలో భారతీయ క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ సీయూఎస్5 కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో లిక్విడ్ హైడ్రోజన్, లిక్విడ్ ఆక్సిజన్‌తో కలిపి 15 టన్నుల క్రయోజెనిక్ ఇంధనం ఉంటుంది. చివరి దశ తన పని పూర్తిచేసిన తర్వాత ఈఓఎస్05 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. ఆ తర్వాత భూమిపైకి నిరంతర నిఘా అందించే ఈ 'హాక్ ఐ' తన అసలు పని మొదలుపెట్టనుంది.

## జైశంకర్‌తో భేటీ..
## భారత్‌కు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు!

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్ ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యాఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు. నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు. జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది. భారత్ ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు. జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.

## 2027 వరకు ఎల్‌నినో ముప్పు: భారత్‌కు WMO హెచ్చరిక

వాతావరణ మార్పులపై 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంఓ) కీలక హెచ్చరిక చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం వేగంగా బలపడుతోందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఇది చాలా తీవ్ర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. ఎల్‌నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని తాజా అంచనాలో వెల్లడించింది. సెప్టెంబర్ 3న విడుదల చేసిన తాజా నివేదికలో డబ్ల్యూఎంవో ఇంతటి అధిక స్థాయి విశ్వాసంతో ఎల్‌నినో కొనసాగింపుపై అంచనా వేయడం ఇదే తొలిసారి. పసిఫిక్ సముద్ర ఉపరితలంతో పాటు లోతైన జలాల్లోనూ అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి ఎల్‌నినో మరింత బలపడేందుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి.

**పసిఫిక్‌లో అసాధారణ వేడి**

ఎల్‌నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియ. దీని ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరును మార్చగలదు. ఎల్‌నినోను పర్యవేక్షించే కీలక ప్రాంతమైన నినో 3.4లో మే నుంచి జులై 2026 వరకు సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. జులైలో ఈ తేడా 2 డిగ్రీలకు చేరింది. జులై చివరి నుంచి ఆగస్టు మధ్య వరకు వారపు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.2 నుంచి 2.6 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదయ్యాయి. సముద్రం అడుగుభాగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. జులై, ఆగస్టు ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 8 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో 2026 చివరి నాటికి ఎల్‌నినో చాలా బలమైన స్థాయికి చేరుకోవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేస్తోంది.

**భారత్‌పై ఎలాంటి ప్రభావం?**

ఎల్‌నినో ప్రభావం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. అయితే భారత్‌కు ఇది కీలకమైన వాతావరణ సంకేతం. సాధారణంగా ఎల్‌నినో బలపడిన సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉంటుంది. ఫలితంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడొచ్చు. భారత్‌లో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ఆందోళనకర అంచనా ఇచ్చింది. మేలో విడుదల చేసిన అంచనాలో సీజన్ మొత్తం వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతంగా అంచనా వేసింది. ఆ అంచనాలకు అనుగుణంగానే ఆగస్టు ముగిసే నాటికి దేశంలో వర్షపాతం 16 శాతం లోటుగా నమోదైంది.

**వేడి, కరవు.. కొన్ని చోట్ల భారీ వర్షా లు!**

ఎల్‌నినో బలపడటంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రమైన వేడి, కరవు, వరదల ముప్పు పెరగొచ్చని డబ్ల్యూఎంఓ హెచ్చరిస్తోంది. సెప్టెంబర్ నవంబర్ మధ్య దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అయితే వర్షపాతం మాత్రం ప్రాంతాన్ని బట్టి మారుతుందని తెలిపింది. భారత్‌పై ఎల్‌నినో ప్రభావాన్ని ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో పాజిటివ్ ఐఓడీ ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీంతో ఎల్‌నినో వల్ల భారత్‌లో సాధారణంగా కనిపించే ప్రభావాల్లో కొంత మార్పు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు.

* **వ్యవసాయం నుంచి నీటి వనరుల వరకు..**

ఎల్‌నినో 2027 ప్రారంభం వరకు కొనసాగితే దాని ప్రభావం ఒక్క సీజన్‌కే పరిమితం కాకపోవచ్చు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్యుత్, నీటి వనరుల వంటి వాతావరణంపై ఆధారపడే రంగాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వాలు, వాతావరణ సంస్థలు ముందస్తు హెచ్చరికలు, విపత్తు సన్నద్ధత చర్యలను మరింత బలోపేతం చేయాలని డబ్ల్యూఎంఓ సూచిస్తోంది. ఎల్‌నినో సహజమైన వాతావరణ చక్రంలో భాగమే. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరుగుతున్న సమయంలో ఇది మరింత ఒత్తిడిని పెంచే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరిక స్పష్టం చేస్తోంది.

## అక్టోబర్ నెలలోనే
## స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

(మొదటిపేజీ తరువాయి)

పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

## నేపాల్‌లో జల ప్రళయం.. బురదలో కూరుకుపోయిన పవర్ స్టేషన్

నేపాల్‌ను భారీ వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ఆగస్టు 26న సంభవించిన ఆకస్మిక వరదల ధాటికి ఆ దేశంలోని జల విద్యుత్ రంగం తీవ్రంగా దెబ్బతింది. చైనా సరిహద్దుకు సుమారు 84 కిలోమీటర్ల దూరంలో ఉన్న గల్ఛీ ప్రాంతంలోని 'జెహ్రే' పవర్ సబ్‌స్టేషన్ పూర్తిగా నీట మునిగి బురదలో కూరుకుపోయింది. త్రిశూలి నదికి ఆనుకొని ఉన్న ఈ విద్యుత్ కేంద్రం మొత్తం బురదమయమైంది. ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర యంత్ర పరికరాలు ధ్వంసమై బురదలో కూరుకుపోయాయి. ప్రస్తుతం నేపాల్ సైనిక దళాల సహాయక చర్యల్లో నిమగ్నమై, బురదలో కూరుకుపోయిన యంత్రాలను వెలికితీసేందుకు శ్రమిస్తున్నాయి. నదీ తీరం వెంబడి ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపడిన విద్యుత్ తీగలు వరద ఉద్ధృతికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. వరద సంభవించిన సమయంలో విధుల్లో ఉన్న రమేశ్ అనే ఎలక్ట్రీషియన్ ఆ భయానక పరిస్థితులను వివరించారు. "ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తోందన్న హెచ్చరికలతో ప్రాణాలు కాపాడుకోవడానికి కొండపైకి పరుగులు తీశాం. చూస్తుండగానే నీటి మట్టం అకస్మాత్తుగా పెరిగి, సబ్‌స్టేషన్‌ను పూర్తిగా ముంచేసింది" అని ఆయన తెలిపారు. స్టేషన్ గోడలపై పైకప్పు వరకు కనిపిస్తున్న నీటి మరకలు వరద బీభత్సాన్ని చాటిచెబుతున్నాయి. ఈ విపత్తు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా వివిధ జల విద్యుత్ ప్రాజెక్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సుమారు 900 మంది కార్మికులు, ఉద్యోగుల ఆచూకీ ఆగస్టు 26 నుంచి లభించడం లేదు. వీరిలో అధిక శాతం మంది సొరంగాల్లో చిక్కుకుపోయి ఉంటారని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సహాయక చర్యల్లో నేపాల్ బృందాలకు భారత్, చైనాలకు చెందిన నిపుణులు కూడా సహకరిస్తున్నారు. జల విద్యుత్ ఉత్పత్తి, ఎగుమతులపైనే ప్రధానంగా ఆధారపడే నేపాల్ ఆర్థిక వ్యవస్థకు ఈ విపత్తు పెను సవాలుగా మారింది.

## ఏపీ, తెలంగాణలో వానలు..
## అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక

తెలుగు రాష్ట్రాల్లో రానున్న కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, తెలంగాణలోని హైదరాబాద్, జగిత్యాల, కామారెడ్డి సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈశాన్య మధ్యప్రదేశ్ పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతుండగా, దానికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం



విస్తరించి ఉంది. దీనికి తోడు, మధ్యప్రదేశ్ నుంచి తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి కూడా కొనసాగుతోందని, వీటి ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో మత్స్యకారులు చేపల వేట కోసం బంగాళాఖాతంలోకి వెళ్లవద్దని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉన్నందున, ప్రజలు విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్‌ల కింద ఉండరాదని, అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

## నల్సార్ వివాదం: BCIకి సుప్రీం షాక్

న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్ (బీసీఐ)కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరటనిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బీసీఐ అధికార పరిధి కేవలం న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారికి ఇది వర్తించదని ధర్మాసనం తేల్చి చెప్పింది. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు లేఖ రాశారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నల్సార్ వైస్‌ఛాన్సలర్‌ను ఆదేశించారు. అంతటితో ఆగకుండా, నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేసుకోవద్దని దేశంలోని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రావడంతో మనన్ కుమార్ మిశ్రా ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా బీసీఐ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ధర్మాసనం, విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నల్సార్ విద్యార్థులకు పెద్ద ఉపశమనం లభించింది.

## ఇంగ్లండ్ తీరంలో పురాతన అగ్నిపర్వతం..
### 45 కోట్ల ఏళ్ల నాటి రహస్యం వెలుగులోకి!

భూగర్భంలో దాగి ఉన్న ఓ అద్భుతాన్ని శాస్త్రవేత్తలు ప్రపంచం ముందు ఆవిష్కరించారు. ఇంగ్లండ్ తూర్పు తీరం కింద లక్షల సంవత్సరాల క్రితం అంతరించిపోయిన ఒక అతి భారీ సూపర్‌వాల్కనో (మహా అగ్నిపర్వతం) ఆనవాళ్లను కనుగొన్నారు. ఈ అగ్నిపర్వతం ప్రస్తుతం ఉన్న ఎట్నా పర్వతం కంటే వేల రెట్లు శక్తిమంతమైనదని, సుమారు 45.4 కోట్ల సంవత్సరాల క్రితం ఇది బద్దలైందని పరిశోధకులు వెల్లడించారు. అంటే.. భూమిపై డైనోసార్లు సంచరించడానికి దాదాపు 20 కోట్ల ఏళ్ల ముందే ఈ భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ పేలుడు వేల హైడ్రోజన్ బాంబులు విడుదల చేసే శక్తితో సమానమని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ సంచలన ఆవిష్కరణకు సంబంధించిన వివరాలను బీబీసీ తన కథనంలో వెల్లడించింది. దశాబ్దాలుగా నార్వే, స్వీడన్, బెలారస్, పోలాండ్ వంటి ఉత్తర యూరప్ దేశాల్లోని పురాతన శిలల పొరల్లో 'కిన్నెకుల్లె టెఫ్రా' అని పిలిచే అగ్నిపర్వత బూడిద నిక్షేపాలు శాస్త్రవేత్తలకు కనిపిస్తున్నాయి. ఇంత విస్తారంగా బూడిదను వెదజల్లిన అగ్నిపర్వతం ఎక్కడుందో గుర్తించడం వారికి పెద్ద సవాలుగా మారింది. తాజాగా బ్రిటిష్ జియోలాజికల్ సర్వే (బీజీఎస్), ఓస్లో విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తల బృందం చేసిన పరిశోధన ఈ మిస్టరీకి తెరదించింది. ఇంగ్లండ్‌లోని నార్ఫోక్, లింకన్‌షైర్ ప్రాంతాల కింద, 'ది వాష్' అని పిలిచే సముద్ర తీర ప్రాంతంలో ఈ సూపర్‌వాల్కనో కేంద్రీకృతమై ఉందని వారు నిర్ధారించారు. ఈ ఆవిష్కరణ కోసం శాస్త్రవేత్తలు సుమారు 80 ఏళ్ల క్రితం పరిశోధనల కోసం తవ్విన బోర్‌వెల్స్ నుంచి సేకరించిన రాతి నమూనాలను మళ్లీ పరిశీలించారు. వందల మీటర్ల లోతు నుంచి తీసిన ఈ నమూనాల్లోని జిర్కాన్, అపటైట్ వంటి సూక్ష్మ స్ఫటికాలను విశ్లేషించడం ద్వారా అగ్నిపర్వతం యొక్క మూలాన్ని కనుగొన్నారు. ఈ ఆవిష్కరణపై బీజీఎస్‌కి చెందిన డాక్టర్ టిమ్ ఫారో మాట్లాడుతూ.. "ఇది ఒక అద్భుతమైన ఫలితం. ఇంగ్లండ్ యొక్క పురాతన భూగర్భ చరిత్రపై మాకున్న అవగాహనను ఇది పూర్తిగా మార్చేస్తుంది" అని వ్యాఖ్యానించారు. బ్రిస్టల్ యూనివర్సిటీకి చెందిన అగ్నిపర్వత నిపుణురాలు ప్రొఫెసర్ జెన్నీ బార్క్లే కూడా ఈ పరిశోధనను ప్రశంసించారు. "యూకే భూగర్భ చరిత్రను అర్థం చేసుకోవడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. నీరు, ఖనిజాలు వంటి సహజ వనరుల వినియోగంలో భూగర్భ నిర్మాణం ప్రాముఖ్యతను ఇది తెలియజేస్తుంది" అని ఆమె పేర్కొన్నారు. సాధారణంగా 1,000 క్యూబిక్ కిలోమీటర్ల కంటే ఎక్కువ పదార్థాన్ని బయటకు వెదజల్లే అగ్నిపర్వతాలను 'సూపర్‌వాల్కనోలు' అంటారు.

## సంపాదకీయం

# మూడ్ ఆఫ్ ద నేషన్

## మారుతున్న రాజకీయ సమీకరణాలు – తగ్గుతున్న బీజేపీ గ్రాఫ్

ఇండియా టుడే ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. 'ఇండియా టుడే - సీ ఓటర్' ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహించే అత్యంత వివరణాత్మక సర్వే ఇది. దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకుల పట్ల ప్రజాదరణ, ప్రస్తుతం దేశంలో నెలకొని ఉన్న సమస్యల పట్ల ప్రజల స్పందనను ఇందులో తెలుసుకుంటారు. జనవరి నెలలో చేసిన సర్వే ఫలితాలకు, ఆగస్టులో నిర్వహించిన సర్వే ఫలితాలకు కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేంతటి తేడాలు కనిపించాయి. జనవరిలో వెల్లడించిన ఫలితాలలో భారతీయ జనతా పార్టీ సొంతంగా 287 సీట్లు గెలుచుకుంటుందని సర్వే తేల్చింది. కానీ ఆగస్టులో వెల్లడించిన సర్వే ఫలితాలలో బీజేపీ 261 సీట్లు మాత్రమే గెలుచుకునే అవకాశం ఉన్నదని పేర్కొంది. అంటే జనవరి ఫలితాల ప్రకారం బీజేపీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోగలిగే పరిస్థితి ఉండగా, ఆగస్టు నాటికి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికిప్పుడు జరగని ఎన్నికల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు అనేవారు ఉన్నారు. కానీ ఈ మధ్య కాలంలో దేశంలో జరిగిన పరిణామాలను, ఈ ఫలితాలను కలిపి చూస్తే భారతీయ జనతా పార్టీ, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న కూటమి పక్షాలు ఒకసారి సమీక్ష చేసుకోవడం తప్పదు అనిపిస్తున్నది. జంతర్ మంతర్ వేదికగా 'బొద్దింకల పార్టీ' జనాన్ని ఆకర్షించిన వైనం గమనించాం. ఇప్పుడు నిర్వహించిన సర్వేలో పాల్గొన్న వారిలో దేశంలో ఉన్న ప్రధాన సమస్యలు నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అని చెప్పడం ఒకెత్తయితే; పేపర్ లీకేజీలు, విద్యా రంగానికి సంబంధించిన సమస్యల పట్ల యువత తమ అసంతృప్తిని వెలిబుచ్చారు. అయితే జనవరిలో ఇండియా టుడే నిర్వహించిన సర్వేలో ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోదీకి మద్దతు తెలిపిన వారి సంఖ్య 55 శాతం ఉండగా, ఆగస్టు ఫలితాలలో మోదీని 48.7 శాతం మంది మాత్రమే కోరుకోవడం ఆశ్చర్యం కలిగించే అంశం. ఆరు నెలల్లో 6 శాతం ప్రజలు మోదీని వ్యతిరేకించడం వెనుక ఉన్న కారణాలు ఏమై ఉంటాయో బీజేపీకి తెలిసే ఉంటుంది. ప్రధానమంత్రి అభ్యర్థిత్వంలో రాహుల్ గాంధీకి వచ్చిన జనవరి ఫలితాలకు, ఆగస్టు ఫలితాలకు తేడా లేకుండా 27 శాతం దగ్గరే స్థిరంగా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే టీడీపీ, జనసేనలు తమ ఆధిక్యాన్ని నిలబెట్టుకోగా బీజేపీ వెనుకబడింది. బీజేపీ పోటీ చేసే స్థానాల్లో వైసీపీకి అవకాశం రావచ్చు అనేది సర్వే ఫలితం. కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సీట్లు కావాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం పట్టుబట్టాలని భావిస్తున్నది; ఫలితంగా వైసీపీ బలపడే అవకాశం ఉంటుంది. తెలంగాణలో బీజేపీ బలపడినట్లుగా ఉన్నది. వీటన్నిటికంటే మించి బీజేపీకి అతి ముఖ్యమైన రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో సర్వే ఫలితాలు ఆ పార్టీకి ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయి. లోక్‌సభ నియోజకవర్గాల ఆధారంగా చేసిన ఈ సర్వేలో ఎన్డీయేకి 38 సీట్లు మాత్రమే వచ్చే అవకాశముందని తేలడం బీజేపీని ఇరకాటంలో పెట్టే అంశం. జనవరి సర్వేలో మోదీ కూటమికి 48 సీట్లు వస్తాయని చెప్పగా, ఆగస్టు సర్వేలో 38 మాత్రమే వస్తాయని చెప్పడం యోగి ఆదిత్యనాథ్ పలుకుబడి తగ్గిందా అనే సందేహాన్ని కలిగిస్తున్నది. యూపీలో విపక్షాలు ఏకమైతే యోగికి గెలుపు కష్టమయ్యే అవకాశం ఉంది. అయితే ఈ సర్వేలు చెబుతున్న మరో విషయం—బీజేపీకి కొద్దిగా నష్టం కలిగే అవకాశమున్నదని చెబుతున్నాయి, ఆ స్థాయిలో ఇండియా కూటమి గానీ, కాంగ్రెస్ గానీ పుంజుకున్న జాడ కనిపించడం లేదు. నరేంద్ర మోదీ వ్యక్తిగత గ్రాఫ్ పడిపోయింది కానీ, ఆ తగ్గిన బలం రాహుల్ వైపు మళ్లలేదు. దేశంలో యువతను పూర్తి స్థాయిలో ఆకర్షించడంలో ఆ యువ నాయకుడు విఫలమయ్యాడని ఎప్పుడో నిరూపితమైంది. గత ఆరు నెలల్లో 'కాక్రోచ్ జనతా పార్టీ' వెనుక యువత నిలబడటానికి వారికి ఒక ప్రత్యామ్నాయ వేదిక దొరకడమే కారణమని ఈ సర్వే ద్వారా అర్థమవుతున్నది. వాస్తవానికి కాక్రోచ్ జనతా పార్టీ అనేది ఒక రాజకీయ పార్టీ కూడా కాదు. అది ఒక యువకుడు భారత ప్రధాన న్యాయమూర్తి దేశ యువతను అవమానపరుస్తూ చేసిన వ్యాఖ్యలపై ఆక్రోశంతో పెట్టిన ఒక పోస్ట్ మాత్రమే. కానీ అది 'అంతై ఇంతై వటుడింతై' అన్నట్లుగా విద్యార్థులను, యువతను విశేషంగా ఆకర్షించింది. ఆకర్షించడంతోనే ఆగకుండా చాలా కాలం తర్వాత యువతను ఉద్యమాల బాట పట్టించింది. శతాబ్ద కాలంగా ఉద్యమ పార్టీలుగా పేరుగాంచిన కమ్యూనిస్టు పార్టీల అనుబంధ విద్యార్థి, యువజన సంఘాలు నిర్దిష్టమైన కార్యాచరణ అంటూ లేని ఒక ఉద్యమంలో పాలుపంచుకోవడం దేశ చరిత్రలోనే తొలిసారి అయ్యుంటుంది. చెప్పాలంటే స్వాతంత్ర్య పోరాటంలో భారతీయులు ఎలా స్వచ్ఛందంగా పాల్గొన్నారో అలా నడిచింది ఈ ఉద్యమం. ఉద్యమాలను నిర్మించడంలో ఒక ప్రణాళికను అనుసరించే పార్టీలు సైతం ఈ మధ్య కాలంలో సాధించలేని ఘన విజయాన్ని ఇది సాధించింది. ఇండియా టుడే సర్వే ఫలితాలు ఆ ఉద్యమ ప్రభావాన్ని తెలియజేస్తున్నాయి. ఈ సర్వే ఆధారంగా ఇప్పటికిప్పుడు భారతీయ జనతా పార్టీకి ఏదో పెద్ద ముప్పు వస్తుందని ఎవరూ అనుకోరు; కానీ వ్యతిరేకత అయితే స్పష్టంగా ఉంది. యోగి మాత్రం గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం యోగికి పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతున్నది ముస్లిం సమాజం. 'యోగి వచ్చాకనే మా జీవితాలు గాడిన పడ్డాయి, బుల్డోజర్ పాలన వల్ల మాకు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు' అనేది వారి వాదన. ఇది విచిత్రంగా అనిపించినా వాస్తవం. యోగిని వ్యతిరేకిస్తున్నది హిందూ సమాజమే. రామ జన్మభూమి ట్రస్ట్ సభ్యులు చేసిన అవినీతిని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ట్రస్ట్ బోర్డ్ సభ్యులను చూసీచూడనట్లు వదిలిపెట్టడం వారిని బాధపెడుతున్నది. ఇది యోగి ఒక్కరి విషయంలోనే అనుకోవడానికి లేదు; దేశవ్యాప్తంగా హైందవ సమాజం యొక్క ఆవేదన ఇది. నిన్న కాక మొన్న అధికారంలోకి వచ్చిన సువేందు అధికారి పట్ల కూడా బెంగాల్ ప్రజలు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. రామ జన్మభూమి వివాదం బీజేపీని అందలమెక్కించింది; ఇప్పుడు అదే రామజన్మభూమి అంశం బీజేపీని హైందవ సమాజానికి దూరం చేసే అవకాశం కనిపిస్తున్నది. సర్వే ఫలితాలు చూస్తే సరైన ప్రత్యామ్నాయం దొరకకపోవడమే దేశంలోని యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అని అర్థమవుతున్నది. ఇది బాధాకరం. కాక్రోచ్ జనతా పార్టీ శాశ్వత ప్రత్యామ్నాయాన్ని చూపించగలదని ఆశించడం కష్టం. ప్రస్తుతానికి వారి పంథా సమస్యలపై పోరాడటమే; ఆ పోరాటాలు ఏయే రంగాలకు విస్తరిస్తాయో చెప్పడం కష్టం. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ మాత్రం కాక్రోచ్ జనతా పార్టీ కార్యాచరణకు భయపడుతున్నది అనేది వాస్తవం; అందుకే ఉద్యమంలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవడానికి ఆరాటపడుతున్నది. ఆఖరుకు 'పుస్తక పఠనం మరచిపోకూడదు' అనే సదుద్దేశంతో చేపట్టిన కార్యక్రమాలను కూడా ఆటంకపరుస్తున్నారు. ఏది ఏమైనా యువత అసంతృప్తిగా ఉన్నది అనే విషయం స్పష్టమైంది. అదే సమయంలో యువత స్తబ్దంగా ఉండకూడదు, చైతన్యవంతంగా ఉండాలి. యువతలోని నిర్లిప్తత, నిరాసక్తత దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు. చైతన్యవంతమైన యువతే దేశానికి ప్రధాన సంపద.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 4

SEP 4

* 1825: భారత స్వాతంత్ర్య సమరయోధుడు దాదాభాయి నౌరోజీ జననం.(మ.1917) (చిత్రంలో)
* 1906: మాలిక్యులర్ బయాలజీకి మార్గదర్శకుడు మాక్స్ డెల్‌బ్రక్ జననం (మ.1981).
* 1935: తెలుగు రచయిత కొమ్మూరి వేణుగోపాలరావు జననం (మ.2004).
* 1962: భారత క్రికెట్ క్రీడాకారుడు కిరణ్ మోరే జననం.
* 1965: వైద్య నిపుణుడు, నోబెల్ బహుమతి గ్రహీత ఆల్బర్ట్ స్విట్జర్ మరణం (జ.1875).
* 1971: దక్షిణాఫ్రికా క్రికెట్ క్రీడాకారుడు లాన్స్ క్లూసెనర్ జననం.
* 1999: పోలీస్ ఉన్నతోద్యోగి


దాదాభాయి నౌరోజీ

చదలవాడ ఉమేశ్ చంద్ర మరణం (జ.1966).
* 2007: తెలుగు సినిమా నటి వై.రుక్మిణి మరణం.
* 2007: నాటక, సినీ కథా రచయిత, జ్యోతిష శాస్త్ర పండితుడు భమిడిపాటి రాధాకృష్ణ మరణం (జ.1929).







కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కు నేడు ఆలయ కమిటీ ఆహ్వాన పత్రం అందచేసింది. ఆలయ ఛైర్మన్ శ్రీ సురేంద్రబాబు, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ రామచంద్రమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే శ్రీ మురళీ మోహన్ సచివాలయంలో సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ నెల 14 నుంచి అక్టోబర్ 4 వరకు కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీఎంకు ఆలయ పండితులు వేదాశీర్వచనం పలికి స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు.

# రామ మందిర ట్రస్టుకు కొత్త సీఈవో
## స్పందించిన అసదుద్దీన్ ఒవైసీ

* రామ మందిర నిధుల చోరీపై సిట్ నివేదికను బయటపెట్టాలని డిమాండ్
* ప్రజల భక్తిని అపహాస్యం చేసి కోట్లు దోచుకున్నారని విమర్శ
* తెలంగాణ ఓటర్ల జాబితా సవరణలపై ప్రజలకు కీలక సూచనలు
* ఓటర్లను చనిపోయినట్లు తప్పుగా చూపిస్తున్నారని ఆరోపణ



అయోధ్య రామ మందిర నిర్మాణానికి అందిన విరాళాల్లో జరిగిన అవకతవకలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన నివేదికను ఎందుకు బహిర్గతం చేయడం లేదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రజల విశ్వాసాన్ని అపహాస్యం చేయడంతో వారు ఆగ్రహంగా ఉన్నారని ఆయన అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఒవైసీ మీడియాతో మాట్లాడారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు తొలి సీఈవోగా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నియమించడంపై ఒవైసీ స్పందించారు. "గతంలో చేసిన నియామకాలు ఎవరు చేశారు? ప్రభుత్వమే కదా? పార్లమెంటులో బిల్లు పెట్టి ట్రస్టును ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కూడా కోట్లాది రూపాయల దొంగతనం జరిగింది. ఇప్పుడు ఎవరిని నియమించుకున్నా అది ప్రభుత్వ ఇష్టమే. కానీ, ఆ దొంగతనం ఎవరు చేశారో ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు" అని అన్నారు. ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదై, నివేదిక కూడా సిద్ధంగా ఉన్నప్పుడు దానిని ఎందుకు బయటపెట్టడం లేదని ఆయన నిలదీశారు. నమ్మకం పేరుతో ఓట్లు, అధికారం సంపాదించి కొందరు అందినకాడికి దోచుకున్నారని ఆరోపించారు.

**ఓటర్ల జాబితాపై సూచనలు**

తెలంగాణలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలోనూ అవకతవకలు జరుగుతున్నాయని ఒవైసీ అన్నారు. మ్యాపింగ్‌లో తేడాలు, ఒకే కుటుంబంలో ఆరుగురికి పైగా ఓటర్లు ఉన్న సందర్భాల్లో నోటీసులు జారీ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి నోటీసులు అందుకున్న వారు వెంటనే విచారణకు హాజరై ఆధార్ కార్డు, ఇతర పత్రాలను సమర్పించాలని సూచించారు. కొందరు ఓటర్లు బతికి ఉన్నా, తమ చిరునామాలోనే నివసిస్తున్నా, చనిపోయినట్లుగా లేదా వేరే ప్రాంతానికి మారినట్లుగా తప్పుగా నమోదు చేస్తున్నారని ఫిర్యాదులను ప్రస్తావించారు.

# సి ఆర్ ఫౌండేషన్ లో ఉపాధ్యాయులకు ఉచిత వైద్య శిబిరం







హైదరాబాద్ మావెరిక్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో టీచర్స్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరం - సి.ఆర్. పాలీ క్లినిక్, కొండాపూర్ లో జరిగింది. సెప్టెంబర్ 5 టీచర్స్ డే సందర్భంగా, హైదరాబాద్ మావెరిక్స్ రోటరీ క్లబ్ సి.ఆర్. పాలీ క్లినిక్ మరియు ఆనంద ఫౌండేషన్ సంయుక్తంగా జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్ బస్తీ నుండి వచ్చిన 17 మంది ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. ఈ శిబిరంలో అందించిన సేవలు: ఉచిత గైనకాలజీ కన్సల్టేషన్, ఉచిత డెంటల్ చెక్ అప్, ఉచిత బీపీ, షుగర్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ పరీక్షలు, ఉచిత ఎక్స్‌రే మరియు ECG, రోటరీ క్లబ్ సభ్యులు మరియు సి.ఆర్. పాలీ క్లినిక్ సిబ్బంది శిబిరం విజయవంతంగా నిర్వహించడానికి సహకరించారు. ఉపాధ్యాయులు అందించిన సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, రోటరీ క్లబ్, ఆనంద ఫౌండేషన్ మరియు సి.ఆర్. పాలీ క్లినిక్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల పట్ల గౌరవాన్ని మరియు సమాజ ఆరోగ్యంపై రోటరీ యొక్క అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది.

## 39వ రోజు.. విజయవంతంగా కొనసాగుతున్న టీడీపీ 'ఇంటింటికీ తెలుగుదేశం'

- **39వ రోజుకు చేరిన 'ఇంటింటికీ తెలుగుదేశం-2026'**
- **రాష్ట్రవ్యాప్తంగా 99.85 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు**
- **కోటి కుటుంబాల మైలురాయికి చేరువైన పార్టీ కార్యక్రమం**
- **ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నేతలు**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం2026' కార్యక్రమం కోటి ఇళ్ల మైలురాయికి చేరువలో ఉంది. గత 39 రోజులుగా విజయవంతంగా కొనసాగుతున్న ఈ పర్యటనల్లో భాగంగా గురువారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 99.85 లక్షల కుటుంబాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఒక్క గురువారం నాడే 1,32,987 ఇళ్లను సందర్శించడం గమనార్హం. కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. ఇంటింటి పర్యటనల ద్వారా టీడీపీ శ్రేణులు ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరిస్తూ, లబ్ధిదారుల నుంచి ప్రత్యక్షంగా స్పందనను సేకరిస్తున్నారు. అదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు, వారి అవసరాలను సైతం పార్టీ ప్రతినిధులు నమోదు చేసుకుంటున్నారు. ఈ వివరాలను సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు టీడీపీ వర్గాలు వెల్లడించాయి.

## కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న నారా లోకేశ్

- **పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్**
- **కాకాని జేఎన్టీయూకేలో హాస్టళ్ల ప్రారంభోత్సవం**
- **కోటప్పకొండలో త్రికోటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు**




ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పల్నాడు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన నరసరావుపేట సమీపంలోని కాకాని జేఎన్టీయూకే ఇంజనీరింగ్ కళాశాలలో నూతన హాస్టల్ భవనాలను ప్రారంభించారు. అనంతరం, ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోటప్పకొండను సందర్శించి శ్రీ త్రికోటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకానిలోని జేఎన్టీయూకే ఇంజనీరింగ్ కళాశాలలో సుమారు రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించిన గౌతమి, కృష్ణవేణి, నాగార్జున హాస్టల్ భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. అనంతరం ఆయన కోటప్పకొండ క్షేత్రాన్ని దర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గర్భాలయంలో త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. తన పర్యటనలో భాగంగా స్వామివారిని దర్శించుకున్న విషయాన్ని లోకేశ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## సురేఖ బర్తరఫ్ ఆమె స్వయంకృతాపరాధం: ఆది శ్రీనివాస్

- **సురేఖకు పార్టీ, ప్రభుత్వం ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న శ్రీనివాస్**
- **అవకాశాలను ఆమె సద్వినియోగం చేసుకోలేదని వ్యాఖ్య**
- **కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో విఫలమయ్యారని ఆరోపణ**



మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడం పూర్తిగా ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం సురేఖకు ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ఆమె సద్వినియోగం చేసుకోలేకపోయారని విమర్శించారు. సొంత కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో సురేఖ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ, ఆమె కుటుంబ సభ్యులు పదేపదే తీవ్రస్థాయిలో బహిరంగ విమర్శలు చేస్తూ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమయంలోనూ వారిని వారించకపోవడం సురేఖ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో కూడిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ కఠిన నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. అధిష్ఠానాన్ని సీఎం బ్లాక్‌మెయిల్ చేశారంటూ సురేఖ చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. అలాగే, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పించబడిన సీనియర్ నేత జి. చిన్నారెడ్డి అంశాన్ని కూడా ఈ సందర్భంగా విప్ ప్రస్తావించారు. చిన్నారెడ్డి అంటే సీఎం రేవంత్ రెడ్డికి ఎంతో గౌరవమని, గతంలో ఆయన గెలుపు కోసం రేవంత్ రెడ్డి శ్రమించారని గుర్తుచేశారు. అయితే ఎంతటి సీనియర్ నాయకులైనా సరే... పార్టీని, ప్రభుత్వాన్ని బలహీనపరిచేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని పార్టీ అధిష్ఠానం తేల్చిచెప్పినందుకే ఈ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని ఆది శ్రీనివాస్ తెలిపారు.

## ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఉచిత ప్రవేశాలు..
## అధ్యయనానికి కమిటీ

అమరావతి: ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాల మార్గదర్శకాల సవరణకు రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(c) ప్రకారం.. రాష్ట్రంలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో నిరుపేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు ఉన్న మార్గదర్శకాలను సవరించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరి 13న ఇచ్చిన తీర్పు ప్రకారం... జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా ప్రస్తుత నిబంధనలను సవరించి, పకడ్బందీగా అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఛైర్‌పర్సన్‌గా 16 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సమీమ్ అన్సారియా ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.




## హామీ నిలబెట్టుకున్న పవన్‌కల్యాణ్..
## ఆదివాసీలకు కొత్త పాఠశాల

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అల్లూరి జిల్లా పెదపాడు గ్రామంలో ఆదివాసీ విద్యార్థుల కోసం కొత్త పాఠశాల భవనాన్ని నిర్మించి హామీ నిలబెట్టుకున్నారు. గతేడాది ఈ ప్రాంతంలో పవన్ కల్యాణ్ పర్యటించినప్పుడు.. స్థానిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని ఆదివాసీలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల దుస్థితి చూసి చలించిన పవన్ వెంటనే స్పందించి రూ.18 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో ఇప్పుడు నూతన భవనాన్ని నిర్మించారు. దీంతో పవన్‌కు ధన్యవాదాలు తెలుపుతూ.. పాఠశాలలో విద్యార్థులు ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు.

## వివేకా హత్య కేసులో రూ.40కోట్ల డీల్..
## అప్రూవర్ దస్తగిరిని ప్రశ్నిస్తున్న ఈడీ

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు(Viveka murder case)లో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరి(Dastagiri)ని విచారిస్తోంది. వివేకా హత్య కేసులో ఎర్రగంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, దస్తగిరి మధ్య జరిగిన రూ.40 కోట్ల డీల్‌పై అధికారులు ప్రశ్నిస్తున్నారు. వివేకా హత్యకు ముందు, తర్వాత బ్యాంక్ లావాదేవీలపై ఈడీ ప్రత్యేక దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో బ్యాంకు స్టేట్‌మెంట్లతో దస్తగిరి విచారణకు హాజరయ్యారు. తనకు రూ.5కోట్లు ఇస్తామని చెప్పినట్టు గతంలో దస్తగిరి సీబీఐకి తెలిపారు. నాడు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.






## ఆటోను ఢీకొట్టిన బైక్.. ముగ్గురి మృతి

తాళ్లరేవు: కాకినాడ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. తాళ్లరేవు మండలం కొత్తూరు వద్ద ఆటోను బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు మృతిచెందారు. ఘటనాస్థలంలో ఇద్దరు.. కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. మృతులను కృష్ణ, కొండ్రు తంబి, మణికంఠగా గుర్తించారు. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# హైకమాండ్‌ను సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు: కొండా సురేఖ

హైదరాబాద్: తనను మంత్రివర్గం నుంచి తొలగించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆమెను బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్‌కు సీఎం లేఖ పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొండా సురేఖ మీడియా సమావేశం నిర్వహించారు. "నా వివరణ తీసుకోకుండా బర్తరఫ్ నిర్ణయం తీసుకున్నారు. ఉరిశిక్ష పడిన ముద్దాయిని కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారు. ఏ తప్పు చేయకపోయినా.. ఎందుకు చేస్తున్నామో చెప్పకుండా నన్ను బర్తరఫ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మంత్రి పదవి నుంచి నన్ను తొలగించే ఉద్దేశం కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదు. ఆ విషయం నాకు వంద శాతం తెలుసు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగిస్తారా? నన్ను రాజీనామా చేయమంటారా? అని సీఎం బెదిరించారు. నాతో పాటు మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కుట్ర చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి కక్షగట్టారు. నాకు తెలియకుండా సుమంత్‌ను తప్పించారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఆయన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు.

*** నేను తప్పు చేయలేదు.. అవమానంగా భావించను**

నాపై చర్యలకు సిఫార్సు చేసిన క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కూడా గతంలో కాంగ్రెస్‌ను తిట్టినవారే. గతంలో రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని దూషించారు. మంత్రి పదవి నుంచి తొలగించినందుకు నేనేమీ బాధపడట్లేదు. నేను తప్పుచేయలేదు.. బర్తరఫ్‌ను అవమానంగా భావించడం లేదు. మేం ప్రజాబలం ఉన్న



నాయకులం.. జనం మా వెంటే ఉంటారు. మంత్రులు, ఎమ్మెల్యేలూ.. మీరు సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చేయి వేసుకుని చెప్పాలి. బయటకు వచ్చి మీ బాధలు చెప్పుకోండి. ప్రజాప్రతినిధులకే పనులు జరగని పరిస్థితి నెలకొంది.

*** కాంగ్రెస్‌కు రాజీనామా చేసే ఆలోచన లేదు**

హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిది. ఇప్పటికైనా అందరూ బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడాలి. పనులు జరగాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రజలకు సేవ, ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలోనూ ఉంది. బర్తరఫ్‌పై పునరాలోచించుకోమని చెప్పను.. పార్టీ తీరు మారాల్సిన అవసరముంది. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలి. రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు. నావైపు ఒక వేలు చూపితే.. రేవంత్ వైపు నాలుగువేళ్లు చూపుతాయి. ప్లాన్‌బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదు. ఎమ్మెల్యేగా కొనసాగుతా. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదు" అని కొండా సురేఖ అన్నారు.

*** దృఢంగా నిలబడతాం: కొండా మురళి**

కొండా సురేఖ బర్తరఫ్‌పై ఆమె భర్త, కాంగ్రెస్ నేత కొండా మురళి 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'ఇదేం కొత్త కాదు. ఉన్నది ఉన్నట్టు కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడితే ఎవరూ తట్టుకోరు! ఇవ్వాళ మేము. రేపు ఎవరో. పదవులు ఉన్నా లేకున్నా మా గౌరవం మాకు ఉంటుంది. మేము ప్రతిదానికి స్పందించకపోవచ్చు. కానీ ప్రతి ఒక్కటి గమనిస్తూనే ఉంటాం. అన్ని దరిద్రాలు ఏకమై మా మీద దాడి చేస్తున్నా.. చేసినా రాజకీయ దాడులను ఎదుర్కొని దృఢంగా నిలబడతాం. మొండిగా ఎదురు వెళ్లగలం' అని పోస్టు చేశారు.

# నాకు పదవులపై ఆశ లేదు: చిన్నారెడ్డి

హైదరాబాద్: తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తనను తొలగించడం పట్ల కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి స్పందించారు. పదవులపై తనకు ఆశ లేదన్నారు. పదవి ఉన్నా



లేకున్నా తనకు గౌరవం ఉంటుందని చెప్పారు. తనకు క్యాబినెట్ హోదా ఉన్నప్పుడే కారు, డ్రైవర్, భద్రతను తీసుకోలేదన్నారు. పదవి కోసం సీఎంను కలిసే ప్రయత్నం చేయలేదని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

# నన్ను బెదిరిస్తే భయపడను: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తననెవరూ బెదిరించవద్దని.. బెదిరిస్తే భయపడనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాతబస్తీలోని నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మించిన భారీ స్టీల్ ఫ్లైఓవర్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొని మాట్లాడారు. "బెదిరిస్తే భయపడను. స్నేహంతోనే నన్ను గెలవగలరు. నేను ఎవరికీ గులామ్‌ను కాదు.. దోస్తీకి మాత్రమే గులామ్‌ను. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. గెలుపోటములు సహజం" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

**ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ**

ఈ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వలేదని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి త్వరగా వంతెన పూర్తిచేసిందని చెప్పారు. తమ ప్రాంత అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వంతో పోరాటానికైనా సిద్ధంగా ఉంటారన్నారు. "ఈ ప్రాంతమంతా ఓల్డ్ సిటీ కాదు.. ఇది ఒరిజినల్



సిటీ. పాతబస్తీలో అణువణువూ నాకు తెలుసు. మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. అది పూర్తయితే పర్యాటకంగా, రవాణాపరంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తిచేశాం. పాతబస్తీ మెట్రోను పూర్తిచేస్తామని చెప్పాం.. చేసి చూపిస్తాం. నాలాలపై ఆక్రమణలను తొలగించి ముంపు సమస్య లేకుండా చేస్తాం. ఎక్కడైనా పేదల ఇళ్లు తొలగిస్తే.. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ప్రతి నెలా రేషన్‌కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం" అని రేవంత్ అన్నారు.

*** రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతు: అసదుద్దీన్**

అంతకుముందు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నారు. రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఆయన తనదైన పంథాలో పరిపాలన చేయాలన్నారు.

## 'సర్' ప్రక్రియ.. రాష్ట్ర ప్రధాన ఎన్నికల
# అధికారికి నోటీసు

హైదరాబాద్: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డికి కూడా నోటీసు వచ్చింది. గత ఎస్ఐఆర్‌లో ఇంటిపేరుతో సరిపోలక పోవడంతో సుదర్శన్‌రెడ్డికి నోటీసు ఇచ్చారు. అప్పుడు ఇంటిపేరు సి అని ఉండగా.. ప్రస్తుత ఓటరు జాబితాలో పూర్తిగా ఉండటంతో.. అనామలిస్ ఓటరుగా ఆయనకు నోటీసు జనరేట్ అయింది. ఈక్రమంలో సుదర్శన్‌రెడ్డి కార్వాన్ నియోజకవర్గంలో ఈఆర్ఓకు పాస్‌పోర్ట్‌ను ధ్రువీకరణ పత్రంగా



సమర్పించి వివరణ ఇచ్చారు.

# టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్.. ఆస్తులు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే!

సూర్యాపేట: సూర్యాపేట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమయ్యను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయన ఇళ్లలో గురువారం సోదాలు చేపట్టారు. సోమయ్య కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులకు చెందిన 7 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో భారీగా ఆస్తుల డాక్యుమెంట్లు, నగదు, బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నారు. సోమయ్యకు చెందిన 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, సూర్యాపేట, హయత్‌నగర్ పరిధిలో 5



రెసిడెన్షియల్ ప్రాపర్టీలను గుర్తించారు. వీటిలో జీ+1, జీ+2, జీ+4+పెంట్‌హౌస్ భవనాలతో పాటు రెండు గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. 8 ఓపెన్ ప్లాట్లు, రూ.4.63 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షల బ్యాలెన్స్, 709 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండి, రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, ఇంట్లో రూ.11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాంకులో 66 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ.49 లక్షల గోల్డ్ లోన్ ఉన్నట్లు గుర్తించారు. ఏసీబీ లెక్కల ప్రకారం మొత్తం ఆస్తుల విలువ రూ.3,54,36,490 అని తేల్చారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ భారీగా ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. సోమయ్య ఆస్తులపై ఏసీబీ మరింత లోతుగా విచారణ కొనసాగిస్తోంది. నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

# కవితకు దిల్లీ హైకోర్టు నోటీసులు

దిల్లీ: 'ది పయనీర్' పత్రిక వ్యవహారంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితకు దిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ పత్రికపై పరువు నష్టం ఆరోపణలు చేయొద్దని ఆమెను ఆదేశించింది. కవితతో పాటు మరో 14 మంది జర్నలిస్టులు, యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపైనా కోర్టు ఆంక్షలు విధించింది.



## సీఎంకు బ్లాక్‌మెయిల్
# చేయాల్సిన అవసరమేంటి?: ఆది శ్రీనివాస్

హైదరాబాద్: మంత్రి పదవి నుంచి కొండా సురేఖ బర్తరఫ్ ఆమె స్వయం కృతాపరాధమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అనేక అవకాశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. "కుటుంబ సభ్యులను కొండా సురేఖ అదుపులో పెట్టుకోలేకపోయారు. ఈ విషయంలో ఆమె విఫలమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి పై పదేపదే విమర్శలు చేసి ప్రభుత్వాన్ని, పార్టీని బలహీనపర్చే ప్రయత్నం చేశారు. కొండా సురేఖ వ్యవహార శైలిని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమగ్రంగా పరిశీలించారు. క్రమశిక్షణారాహిత్యాన్ని సహించవద్దనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారని కొండా సురేఖ అబద్ధాలు చెబుతున్నారు. సీఎంకు ఆ అవసరమేంటి? ఆమెకు ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేదు. పదే పదే తప్పులు



చేశారు. ముఖ్యమంత్రిపై కుటుంబసభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తుంటే కనీసం వారించలేదు. గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సీఎం సర్దుకుపోయారు. ఇప్పుడు కూడా నోటికొచ్చినట్లు మాట్లాడినా సీఎం ఎక్కడా బయటపడలేదు. సోనియా, రాహుల్‌పై గౌరవముంటే కాంగ్రెస్‌ను బలహీనపర్చే పనులు ఎందుకు చేశారు? కొండా సురేఖతో పాటు సీనియర్ నేత చిన్నారెడ్డిని కూడా పదవి నుంచి తప్పించారు. సీఎంకు చిన్నారెడ్డి చాలా ఇష్టమైన నాయకుడు. కానీ పార్టీకి నష్టం కలిగిస్తే ఎవరైనా ఒక్కటేనని సీఎం రేవంత్ భావించారు. పార్టీ, ప్రభుత్వాన్ని బలహీనపర్చే చర్యలను ఉపేక్షించబోమని అధిష్ఠానం స్పష్టం చేసింది" అని ఆది శ్రీనివాస్ అన్నారు.

# గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ.. కొండా సురేఖ బర్తరఫ్‌కు ఆమోదం

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. ఈ మేరకు హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్ నుంచి సురేఖను తొలగించేందుకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు లేఖ పంపారు. ఆమెను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఎం సిఫార్సు చేశారు. గురువారం రాత్రి లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. అనంతరం సీఎం సిఫార్సును గవర్నర్ ఆమోదించారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**చిన్నారెడ్డి స్థానంలో గద్వాల్ విజయలక్ష్మి**

మరోవైపు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న చిన్నారెడ్డి స్థానంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని సీఎం రేవంత్ నియమించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్‌గా జి.సుధారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**ఏం జరిగిందంటే..**

ఇటీవల పరకాల నియోజకవర్గం గీసుకొండలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కించపరిచేలా ఆమె వ్యాఖ్యలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆమె తన వివరణ పంపారు. కుమార్తె వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. వాటితో తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కోరారు. మరోవైపు వనపర్తి వ్యవహారంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిపై మాజీ మంత్రి చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. వివరణ ఇవ్వాలని ఆయనకూ డీఏసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణలను హైకమాండ్‌కు పీసీసీ పంపింది. కొండా సురేఖతో పాటు చిన్నారెడ్డి వ్యవహారంపై గత రెండు రోజులుగా



కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్, ముఖ్యనేతలు చర్చలు జరిపారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడిన మంత్రివర్గంలో స్థానం పొందిన సురేఖ వ్యవహారం గతంలో కూడా వివాదాస్పదమైనా, ఈసారి సీఎం రేవంత్‌రెడ్డి చర్యకు గట్టిగా పట్టుబట్టారు. పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి కూడా చర్య తీసుకోవాలనడం, పీసీసీ క్రమశిక్షణ కమిటీ సైతం అదే సిఫార్సు చేసిన నేపథ్యంలో అధిష్ఠానం కూడా వారిద్దరిపై వేటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# బీసీ మహిళ కాబట్టే వేటు వేశారు: కొండా సురేఖ బర్తరఫ్ పై శ్రీనివాస్ గౌడ్

- **కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలనుకోవడం దారుణమన్న శ్రీనివాస్ గౌడ్**

తెలంగాణ కేబినెట్ నుంచి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలనే అంశంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఒక బీసీ మహిళా మంత్రిని పదవి నుంచి తొలిగించాలనుకోవడం దారుణమని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనకు నిరసనగా నారాయణపేట జిల్లా కోస్గిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన 'బీఆర్ఎస్ రైతు గర్జన' సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు నిత్యం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా బహిరంగంగానే మాట్లాడుతున్నారని, కానీ కేవలం ఓ బీసీ మహిళా నాయకురాలిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని పదవి నుంచి తొలగించడం కాంగ్రెస్ వైఖరికి అద్దంపడుతోందని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. సొంత పార్టీ మంత్రుల్లో కొందరికి ఒక న్యాయం, కొండా సురేఖకు మరొక న్యాయమా? అని నిలదీశారు. ప్రస్తుత కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అవినీతి, కమీషన్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం, సురేఖ విషయంలో మాత్రం ఇంత కఠినంగా వ్యవహరించడం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచనా ధోరణి ఉందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను అనేక రకాలుగా మోసం చేస్తూ వస్తోందని, పదవుల



తొలగింపులోనూ బడుగు, బలహీన వర్గాల నేతలనే బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఉద్వాసన కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయమైనప్పటికీ, ఒక బలమైన బీసీ నాయకురాలికి జరిగిన ఈ అన్యాయాన్ని ప్రజలు, బీసీ వర్గాలు గమనిస్తున్నాయని అన్నారు.

# జగన్నాథుడి బ్యాంక్ బ్యాలెన్స్ రూ.1912 కోట్లు.. 60,821 ఎకరాల భూమి..!

ఒడిశాలోని పూరీ జగన్నాథుడికి వేల కోట్ల రూపాయల ఆస్తులున్నాయి. ఆ ఆలయం పేరిట దేశవ్యాప్తంగా వివిధ జాతీయ బ్యాంకుల్లో ఉన్న ఖాతాల్లో రూ.1,912 కోట్ల డిపాజిట్లు ఉన్నట్లు శ్రీ జగన్నాథ ఆలయ పాలనావిభాగం (ఎస్‌జేటీఏ) ఒక ప్రకటనలో వెల్లడించింది. వాటిలో రూ.1,811 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ఉండగా.. మరో రూ.100.71 కోట్లు సేవింగ్స్, కరెంట్ ఖాతాల్లో ఉన్నట్లు తెలిపింది. డిపాజిట్ చేసిన మొత్తంలో రూ.500 కోట్లు ఒడిశా ప్రభుత్వం అందించిన కార్పస్ ఫండ్ అని పేర్కొంది. స్వామివారి పేరిట దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 60,821 ఎకరాల భూమి ఉంది. ఇందులో 60,426 ఎకరాలు ఒడిశాలోనే ఉన్నాయి. ఆలయ రత్నభండార్‌లో బంగారు, వజ్రాల ఆభరణాలు ఉన్నాయి. ఆలయానికి వచ్చే ఆదాయంలో.. భక్తులు ఇచ్చే కానుకలు, ఆలయం పేరిట ఉన్న క్వారీలు, గనుల నుంచి వచ్చే సొమ్ము, డిపాజిట్లపై వడ్డీ, ప్రభుత్వ గ్రాంట్లు, భూవిక్రయాలు భాగమని పాలనా విభాగం పేర్కొంది. "ఈ ఆదాయంలో ఒక భాగాన్ని కార్పస్ ఫండ్‌గా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తాం. ఫౌండేషన్ ఫండ్‌గా ఇంకొంత మొత్తాన్ని జమ చేస్తాం. మిగతా సొమ్మును ఆలయ నిధిగా ఉంచుతాం'' అని ఎస్‌జేటీఏ ప్రధాన పాలనాధికారి వెల్లడించారు. ఇక, ఆలయ నిధిని రోజూవారీ ఖర్చుల కోసం వాడుతుంటారు. హుండీ విరాళాలను ప్రతిరోజూ లెక్కిస్తారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు భక్తులు తెలుసుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి. అలాగే పూరీ ఆలయం 'సమర్పణ్' పేరిట ఒక డిజిటల్ డొనేషన్ ప్లాట్‌ఫామ్‌ను కూడా నిర్వహిస్తోంది.



## మద్రాస్ హైకోర్టులో స్టాలిన్‌కు ఎదురుదెబ్బ

- **కొలత్తూర్ నియోజకవర్గంలో ఓటమిపాలైన స్టాలిన్**
- **ఈవీఎంలు, వీవీపాట్‌లలో అక్రమాలు జరిగాయంటూ పిటిషన్**
- **పిటిషన్ విచారణార్హం కాదన్న ధర్మాసనం**



తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన సొంత నియోజకవర్గమైన కొలత్తూర్‌లో ఎదురైన ఓటమిని సవాలు చేస్తూ... ఈవీఎంలు, వీవీపాట్ స్లిప్పుల రీకౌంటింగ్ నిర్వహించి ప్రత్యర్థి విజయాన్ని రద్దు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, అది విచారణార్హం కాదంటూ కొట్టివేసింది. వివరాల్లోకి వెళితే... కొలత్తూర్ శాసనసభ నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి వి.ఎస్. బాబు చేతిలో 8,795 ఓట్ల తేడాతో స్టాలిన్ పరాజయం పాలయ్యారు. అయితే ఈవీఎంలు, వీవీపాట్‌లలో అక్రమాలు జరిగాయని, కొన్ని యంత్రాలు అభ్యర్థి పేరును కూడా గుర్తించడంలో విఫలమయ్యాయని ఆరోపిస్తూ స్టాలిన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. 100 శాతం వివిపాట్ స్లిప్పులను లెక్కించి, తనను విజేతగా ప్రకటించాలని కోర్టును కోరారు. అయితే కేంద్ర ఎన్నికల సంఘం తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాదులు.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 329(b), ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ఎన్నికల ఫలితాలను కేవలం 'ఎలక్షన్ పిటిషన్' ద్వారా మాత్రమే సవాలు చేయాల్సి ఉంటుందని, సాధారణ రిట్ పిటిషన్ ద్వారా కాదని స్పష్టం చేశారు. ఈ వాదనలతో ఏకీభవించిన మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ. ధర్మాధికారి, జస్టిస్ జి. అరుళ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం స్టాలిన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తుది తీర్పు వెలువరించింది.

## రేప్ కేసులను సెటిల్ చేసేందుకు ఆ సీఎం దంపతుల రాకెట్: భాజపా

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ , ఆయన సతీమణి గుర్‌ప్రీత్ కౌర్‌పై భాజపా సంచలన ఆరోపణలు చేసింది. ఈ సీఎం దంపతులు రేప్ కేసుల్ని సెటిల్ చేసేందుకు మధ్యవర్తుల ద్వారా ఒక రాకెట్ నడుపుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అందుకోసం రూ.5 కోట్లు తీసుకున్నారని ఆరోపించింది. ఈ మేరకు భాజపా జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారీ మీడియా సమావేశంలో కొన్ని ఆడియో క్లిప్‌లను విడుదల చేశారు. అత్యాచార కేసులు, క్రిమినల్ కేసులను సెటిల్ చేసుకునేందుకు తనకున్న రాజకీయ పలుకుబడిని వాడుకుంటానని ఓ



వ్యక్తి చెప్తున్నట్లు ఆ ఆడియో క్లిప్స్‌ను బట్టి వెల్లడవుతోంది. అయితే అతడు ఎక్కడా కూడా ముఖ్యమంత్రి దంపతుల పేర్లు మాత్రం ప్రస్తావించలేదు. కొన్నిరోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్ గుర్విందర్ సింగ్ చాహల్ జైలు నుంచి విడుదలవడంతో ఈ వివాదం మొదలైంది. అతడు ఒక మహిళను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడికి అనుకూలంగా వ్యవహరించేందుకు గుర్‌ప్రీత్ కౌర్ రూ.5 కోట్లు డిమాండ్ చేశారని పంజాబ్‌హరియాణా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజిత్ సింగ్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC)కు ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషన్ స్పందించింది. ఆరోపణలపై విచారణ జరిపి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, డీజీపీని ఆదేశించింది. ఈ క్రమంలోనే భాజపా (BJP) ఆడియో క్లిప్స్‌తో మీడియా ముందుకు వచ్చింది. "భగవంత్ మాన్, ఆయన భార్య.. దోపిడీ, అవినీతి దందాను నడుపుతున్నారు. వారు మధ్యవర్తులను ఉపయోగించుకొని.. అత్యాచార కేసుల్ని పరిష్కరిస్తున్నారు. ఈ వ్యవహారం తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. సీఎం నివాసం ఒప్పందాలు కుదుర్చుకునే ప్రదేశంగా మారిపోయి, కట్ మనీ (కమీషన్) సూపర్ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు చేరుతోందా?'' ప్రదీప్ ఆరోపించారు . ఈ ఆరోపణలపై పంజాబ్ సీఎం, ఆమ్‌ఆద్మీపార్టీ (AAP) నుంచి ప్రస్తుతానికి ఎలాంటి స్పందనారాలేదు.

## రాజకీయ కక్షతోనే ఓటు తొలగింపు: రాఘవ్ చడ్డా

పంజాబ్‌లో చేపట్టిన ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణలో రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చడ్డా పేరును ఓటరు జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ వివాదం చెలరేగింది. దీనిపై తాజాగా ఎంపీ స్పందించారు. ఇది రాజకీయ కక్షలో భాగమేనని మండిపడ్డారు. పార్టీ మారానన్న కోపంతోనే ఇలా చేశారని దుయ్యబట్టారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. శాశ్వతంగా వలస వెళ్లినవారిగా పేర్కొంటూ మొహాలీ ఓటరు జాబితా నుంచి తన పేరు తొలగించారని చడ్డా పేర్కొన్నారు. తాను పంజాబ్ నుంచి ఎన్నికైన రాజ్యసభ



సభ్యుడినని అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల కోసం సర్ మార్గదర్శకాల్లో ప్రత్యేక నిబంధన ఉన్నప్పటికీ, పంజాబ్ అధికారులు దానిని ఉల్లంఘించారని ఆరోపించారు. ఇది సాధారణ పొరపాటు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఇది ముసాయిదా జాబితా మాత్రమే అని, దీనిపై తాను అభ్యంతరాలు తెలియజేస్తానని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా.. చడ్డా ఆరోపణలను ఆమ్ ఆద్మీ పార్టీ ఖండించింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోనే జరుగుతోందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేదని స్పష్టం చేసింది. కాగా.. పంజాబ్‌లో ఇటీవల సర్ ముసాయిదా జాబితా విడుదలైంది. ఇందులో సుమారు 20.66 లక్షల మంది పేర్లను ఓటరు లిస్ట్ నుంచి తొలగించారు.

### చెరువులో దాక్కున్న దొంగ..

## సినీ ఫక్కీలో పోలీసుల ఛేజింగ్

దొంగతనం తదితర కేసుల్లో అభియోగాలు ఎదుర్కొంటున్న ఓ నిందితుడు అరెస్టు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు రావడాన్ని గమనించి ఓ చెరువులోకి దూకాడు. వెనక్కి తగ్గని పోలీసులు సినీ ఫక్కీలో అతడిని వెంటాడారు. చెరువులోకి దిగి మరీ అతడిని పట్టుకొచ్చిన ఘటన కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దిలీప్ అలియాస్ కారియాపై భద్రావతి నగరంలో వివిధ పోలీస్ స్టేషన్లలో 16 కేసులున్నాయి. బెయిల్‌పై బయట ఉన్న అతడు కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలోనే అతడిని అరెస్టు చేయాలని న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు ఆపరేషన్ చేపట్టారు. అతడి ఆచూకీ తెలుసుకొని



పట్టుకునేందుకు వెళ్లగా నిందితుడు తప్పించుకొని ఓ చెరువులో దూకాడు. గడ్డి మాటున అరగంటకుపైగా దాక్కున్నాడు. దీంతో చెరువులోకి దిగిన పోలీసులు నిందితుడిని బయటకు తీసుకొచ్చారు.

# అభినందన్ వర్ధమాన్

## ఇక కమర్షియల్ పైలట్‌గా.. వాయుసేన నుంచి ముందస్తు రిటైర్మెంట్..!

భారత వాయుసేనకు చెందిన ఫైటర్ పైలట్ అభినందన్ వర్ధమాన్ కొత్త కెరీర్‌ను ఎంచుకున్నారు. గోవాకు చెందిన ప్రైవేటు విమానయాన సంస్థలో కమర్షియల్ పైలట్‌గా చేరారు. ఇందుకోసం ఐఏఎఫ్ నుంచి ముందస్తు రిటైర్మెంట్ తీసుకున్నారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. 22 ఏళ్ల పాటు వాయుసేనలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించిన వర్ధమాన్ గోవా కేంద్రంగా నడుస్తున్న FLY



91లో పైలట్‌గా చేరారు. ఈ కొత్త ఉద్యోగంలో ఆయన ఆగస్టులోనే చేరినట్లు తెలుస్తోంది. కాగా.. 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా ఘటన తర్వాత భారత సైన్యం నిర్వహించిన బాలాకోట్ వైమానిక దాడి సమయంలో అభినందన్ వర్ధమాన్ పేరు దేశవ్యాప్తంగా వినిపించింది. బాలాకోట్ దాడి జరిగిన మరుసటిరోజు ఫిబ్రవరి 27న పాక్ వైమానిక దళానికి చెందిన ఎఫ్16 విమానం భారత్‌పైకి దూసుకురాగా.. నాటి వింగ్ కమాండర్ అభినందన్ మిగ్21 ఫైటర్ జెట్‌తో దానిని నేలకూల్చారు. అదే సమయంలో వర్ధమాన్ విమానం కూడా కూలిపోవడంతో పారాచూట్ సాయంతో కిందకు దూకగా ఆయన పాక్ భూభాగంలో పడిపోయారు. దీంతో ఆయన్ను పాక్ జవాన్లు అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో అభినందన్‌ను తిరిగి అప్పగించాలని భారత్ నుంచే కాకుండా అంతర్జాతీయస్థాయిలో పాక్‌పై తీవ్ర ఒత్తిడి వచ్చింది. దీంతో దాయాది సైన్యం ఆయనను వాఘా సరిహద్దు వద్ద భారత్‌కు అప్పగించింది. తర్వాత మళ్లీ విధుల్లోకి వచ్చిన వర్ధమాన్.. గ్రూప్ కెప్టెన్ స్థాయికి ఎదిగారు. 2021లో కేంద్ర ప్రభుత్వం ఆయనను 'వీర్ చక్ర' పురస్కారంతో సత్కరించింది.

# న్యాయపోరాటం చేయను..

## మరణశిక్ష విధించండి: యాసిన్ మాలిక్

కశ్మీరీ పండిత్ మహిళ సరళా భట్ హత్య కేసులో తనకు ఎలాంటి ప్రమేయం లేదని, తాను నిందితుడిని కాదని నిషేధిత జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (JKLF) చీఫ్ మహమ్మద్ యాసిన్ మాలిక్ పేర్కొన్నాడు. అయితే, ఈ కేసులో న్యాయపోరాటం చేయబోనని, బదులుగా తనకు మరణశిక్ష విధించాలంటూ శ్రీనగర్‌లోని ప్రత్యేక కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాడు. అదే సమయంలో భార్యతో వివాహ బంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటించాడు. యాసిన్ మాలిక్ ప్రస్తుతం దిల్లీలోని తిహాడ్ జైలులో ఉన్నాడు. 1990 ఏప్రిల్‌లో సరళా భట్ హత్యకు గురైంది. ఈ కేసులో యాసిన్ మాలిక్‌పై అభియోగాలు మోపుతూ దర్యాప్తు సంస్థ ఈ ఏడాది



జూన్‌లో ఛార్జిషీట్ దాఖలు చేసింది. అయితే, మాలిక్ దీన్ని ఖండించాడు. ఆ సమయంలో తాను భవనం పైనుంచి పడిపోయి కోమాలో ఉన్నానని, అటువంటి స్థితిలో ఉన్న వ్యక్తి ఎలా హత్యకు ప్రణాళిక రచించగలడని ప్రశ్నించాడు. పైగా.. అప్పట్లో ఈ కేసులో తన పేరును ప్రస్తావించలేదని గుర్తుచేశాడు. ప్రస్తుత ఛార్జిషీట్‌ను రాజకీయ కారణాలతో సృష్టించిన కల్పిత కథగా పేర్కొన్నాడు.

## ఒంటికాలితో గెంతుతూ బడికి.. ఏడేళ్ల చిన్నారి చదువు సంకల్పం

బలియా (యూపీ): ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలియా జిల్లా రాణీపుర్‌కు చెందిన రాగిణి (7)కి అందరు పిల్లల్లా తానూ ఆడుకోవాలని ఉన్నా.. ప్రమాదం కారణంగా ఓ కాలు అవిటిగా మారడంతో వీలుపడలేదు. చదువు విషయంలో మాత్రం అలాగని ఆమె ఊరుకోలేదు. స్నేహితులు భుజాలకు సంచులు వేలాడేసుకొని స్కూలుకు వెళ్తుంటే.. తానూ వెళ్తానని పట్టుబట్టింది. ఇంటి నుంచి దాదాపు అర కిలోమీటరు ఉన్న పాఠశాలకు నిత్యం ఒంటికాలితో గెంతుతూ వెళ్తోంది. ఆర్నెల్ల వయసులో రాగిణికి జరిగిన ప్రమాదం తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో



చికిత్స చేయించామని, మెరుగైన చికిత్సకు ఆర్థికస్తోమత చాలక ఇంటికి తీసుకువచ్చేసినట్లు ఆమె తల్లి బబితాదేవి తెలిపారు. రాగిణి తండ్రి ఓ దినకూలీ. ఒకటో తరగతి చదువుతున్న ఈ చిన్నారి కథ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ స్పందించారు. రాగిణికి ట్రైసైకిలు, ఆమె కుటుంబానికి రూ.26,500 ఆర్థికసాయాన్ని అందించారు. వీడియోకాల్ ద్వారా మాట్లాడి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. జిల్లా కలెక్టర్ మంగళ ప్రసాద్ సింగ్ బాలిక ఇంటికి వెళ్లి మాట్లాడి, తగిన వైద్యసాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

## విడిగా ఉంటూ భార్యగా ఉంటానంటే ఎలా?

దిల్లీ: వివాహాన్ని కాపాడటమే సంబంధిత చట్టం ప్రాథమిక లక్ష్యమైనా భార్యాభర్తలు దీర్ఘకాలం పాటు విడివడి ఉంటున్నప్పుడు ఆ పరిస్థితిలో వాస్తవికతను గుర్తించాల్సిందేనని సుప్రీంకోర్టు పేర్కొంది. 2005 డిసెంబరు నుంచి వేర్వేరుగా జీవిస్తున్న దంపతులకు విడాకులు మంజూరుచేస్తూ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ శ్రీచంద్రశేఖర్‌ల ధర్మాసనం బుధవారం ఈ వ్యాఖ్య చేసింది. భార్యకు శాశ్వత భరణం కింద రూ.7 లక్షలు చెల్లించాలని భర్తను ఆదేశించింది. మధ్యప్రదేశ్ హైకోర్టు తనకు విడాకులు మంజూరు చేయడానికి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భర్తను విడిచిపెట్టే ఉద్దేశం భార్యకు లేదని హైకోర్టు భావించడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. అత్తవారింటికి తీసుకువెళ్లేందుకు భర్త ఎన్ని ప్రయత్నాలు చేసినా



తగిన కారణం లేకుండానే ఆమె నిరాకరించేదని గుర్తుచేసింది. దంపతులకు పిల్లలు లేకపోవడం, రాజీ కుదిర్చే ప్రయత్నాలు ఇన్నేళ్లలో విఫలం కావడం వల్ల విడాకులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. "ప్రస్తుత కేసులో భార్య తన వైవాహిక సంబంధ బాధ్యతల్ని నిర్వర్తించేందుకు సుముఖత వ్యక్తంచేశారు. ఆమె ప్రవర్తన వేరేవిధంగా ఉన్నందువల్ల కేవలం హామీ సరిపోదు. వివాహ బంధం పునరుద్ధరించగల స్థితిలో ఉందా, లేదా అనేది తేల్చడంలో వారిద్దరూ దీర్ఘకాలం నుంచి విడివిడిగానే జీవిస్తున్నారనేది కీలకమైన అంశమని మరో తీర్పులోనూ సుప్రీంకోర్టు గతంలో చెప్పింది'' అని వివరించింది.

*** సంధికాలంలో కమిషన్లు పనిచేయకపోవడం తగదు**

రాష్ట్ర, జిల్లా స్థాయి వినియోగదారుల కమిషన్లలో ఖాళీల గురించి స్థాయీ నివేదికపై రాష్ట్రాలన్నీ మూడు వారాల్లో స్పందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేవలం సంధికాలం వల్ల ఏ కమిషన్ కూడా పనిచేయకపోవడం తగదని స్పష్టంచేసింది. కమిషన్ సభ్యులకు జీతభత్యాలపై తాము ఇదివరకు ఇచ్చిన ఆదేశాలపై చర్యా నివేదికను సమర్పించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం బుధవారం ఆదేశించింది.

**నీట్-పీజీ రీఎగ్జామ్‌పై..**

నీట్ పీజీ పరీక్షను రాయలేకపోయిన 2,445 మంది కోసం దానిని మళ్లీ నిర్వహించాలని నిర్ణయించడాన్ని కొంతమంది సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఇదివరకు సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన ఉత్తర్వును ఇది ఉల్లంఘిస్తోందని వారు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనానికి తెలిపారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని కోరారు. జస్టిస్ పి.ఎస్.నరసింహా నేతృత్వంలోని ధర్మాసనం నీట్ వ్యవహారాలన్నింటిపై విచారణ చేపట్టిన దృష్ట్యా అక్కడే దీనిని ప్రస్తావించాలని సీజేఐ సూచించారు.




## ఆసుపత్రి బిల్లు సరే..
# ఖర్చులూ చూసుకోవాలి

**ఆసుపత్రి నుంచి ఇంటికి రాగానే అనారోగ్య సమస్యల నుంచి, వాటికి అయ్యే ఖర్చుల నుంచి పూర్తిగా ఉపశమనం లభించిందని చాలా కుటుంబాలు భావిస్తుంటాయి. కానీ, అసలు సవాలు అక్కడే**

* **మొదలవుతుంది. అవేమిటి? వాటికి పరిష్కారాలు ఎలా? తెలుసుకుందాం..**

శస్త్రచికిత్స, పక్షవాతం, తీవ్రమైన ఇన్ఫెక్షన్లు లేదా ప్రమాదాల వంటి సందర్భాల్లో రోగి సాధారణ స్థితికి రావడానికి వారాలు, నెలల సమయం పడుతుంది. ఈ సమయంలో అవసరమయ్యే ఫిజియోథెరపీ, నర్సింగ్ సేవలు, మందులు, వైద్యుల సంప్రదింపుల ఖర్చులు కుటుంబాలకు అదనపు భారమవుతాయి. ఆరోగ్య బీమా ఈ ఖర్చులలో కొన్నింటిని భరించినప్పటికీ, ఆ రక్షణ ఎల్లప్పుడూ పరిమితంగానే ఉంటుంది. దీని పరిధి, కాలపరిమితి పూర్తిగా పాలసీ నిబంధనలపైనే ఆధారపడి ఉంటాయి.

**పరిమితులు ఉంటాయి..**

చాలా బీమా పాలసీలు ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన తర్వాత అయ్యే ఖర్చులను భరిస్తాయి. సాధారణంగా డిశ్చార్జ్ అయినప్పటి నుంచి 60180 రోజుల వరకూ ఈ పరిమితి ఉంటుంది. ఈ కాలంలో వైద్యుల సంప్రదింపులు, సూచించిన మందులు, రోగ నిర్ధారణ పరీక్షల ఖర్చులను బీమా సంస్థలు చెల్లిస్తాయి. ఫిజియోథెరపీ, నర్సింగ్ సేవలు పాలసీలో ప్రత్యేకంగా పేర్కొంటేనే వర్తిస్తాయి.

**ఇంటి వద్ద చికిత్సకు..**

ఇంటి వద్ద లభించే వైద్య సేవలు, డిశ్చార్జ్ తర్వాత ఇచ్చే పోస్ట్‌హాస్పిటలైజేషన్



కవరేజీలు రెండూ ఒకటి కావు. కొన్ని పాలసీలు ఇంటి వద్ద చికిత్సను ప్రత్యేక ప్రయోజనంగా అందిస్తాయి. దీన్ని కొన్ని కఠినమైన షరతులకు లోబడి మాత్రమే భరిస్తాయి. వైద్యుల సూచన, నిరంతర పర్యవేక్షణ అవసరం కావడం, బీమా నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా నగదు రహిత సేవలు పొందడం వంటి అనేక నిబంధనలు ఇందులో ఉంటాయి. వైద్యపరంగా తప్పనిసరైన పరిస్థితుల్లో మాత్రమే ఆక్సిజన్ ఖర్చులను బీమా పరిధిలోకి తీసుకుంటారు. అంతేకానీ, ప్రతి ఆక్సిజన్ సిలిండర్ కొనుగోలు, అద్దె ఖర్చులను బీమా సంస్థలు చెల్లించకపోవచ్చు.

**ప్రత్యేక నిధి అవసరం..**

ఆరోగ్య బీమా ఉంది కదా అని అంతా సజావుగా సాగుతుందని అనుకోవడం సరికాదు. సుదీర్ఘకాలం కోలుకునే ఖర్చుల కోసం ముందే సిద్ధంగా ఉండటమే తెలివైన పని. నెలవారీగా ఉండే ఖర్చులను అంచనా వేసి, దానికి తగ్గట్టుగా కొంత నిధిని ఏర్పాటు చేసుకోవాలి. దీనిని అత్యవసర నిధితో కలపకుండా, ప్రత్యేకంగా ఉంచుకోవాలి. పాలసీని కొనుగోలు చేసేటప్పుడు, పునరుద్ధరించేటప్పుడు కొన్ని అంశాలను సరిచూసుకోవాలి. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చాక ఏయే ఖర్చులను బీమా పాలసీ చెల్లిస్తుంది? నిబంధనలు ఏం చెబుతున్నాయి? బీమా సంస్థ ముందస్తు అనుమతి అవసరమా?లాంటివి చూడాలి. చికిత్సకు సంబంధించిన అన్ని వివరాలూ, బిల్లులూ జాగ్రత్త చేసుకోవాలి.

# పేపాల్‌లో లేఆఫ్‌లు.. భారీగా ఉద్యోగుల తొలగింపు

ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ పేపాల్ భారత్‌లో భారీగా ఉద్యోగులను తొలగించింది. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోని కార్యాలయాల్లో పనిచేస్తున్న 600 మందికి ఉద్వాసన పలికినట్లు సమాచారం. భారత్‌లో ఈ సంస్థకు 6 వేల మందికిపైగా ఉద్యోగులు ఉండగా.. వారిలో దాదాపు 10శాతం కోత విధించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై భారత్‌లోని పేపాల్ సంస్థ అధికార ప్రతినిధి స్పందించారు. లేఆఫ్‌ల ప్రభావం 220 మందిపైనే పడినట్లు వివరణ ఇచ్చారు. సంస్థ కార్యకలాపాలను సరళీకరించడం, అమలు సామర్థ్యాన్ని మెరుగుపరచడం, దీర్ఘకాలిక వృద్ధిని నమోదు చేసే చర్యల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లుగా ఓ జాతీయ మీడియా సంస్థకు తెలిపారు. టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఆపరేషన్స్,




చెల్లింపులు, ఆర్థిక విభాగాల్లోని ఉద్యోగులపై ఈ లేఆఫ్‌ల ప్రభావం పడినట్లు తెలుస్తోంది. మరోవైపు, తమకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే ఆగస్టు 31న కాన్ఫరెన్స్ కాల్ నిర్వహించి తొలగింపు విషయాన్ని చెప్పారంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ తర్వాత వెంటనే కంపెనీ వ్యవస్థలకు తమ యాక్సెస్‌ను నిలిపివేశారని వాపోతున్నారు. కొందరికి నేరుగా ఈమెయిల్ ద్వారా తొలగింపు సమాచారం అందించారు. ఉద్యోగులకు ఔట్ బోర్డింగ్ ప్రక్రియతోపాటు, నెల జీతాన్ని అందిస్తామని ఆ సంస్థ తెలిపినట్లు సమాచారం. పేపాల్ ప్రపంచవ్యాప్తంగా చేపడుతున్న పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ ఉద్యోగాల కోత విధించినట్లు తెలుస్తోంది. 2025 డిసెంబరు నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థలో 23,800 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో దాదాపు 20 శాతం ఉద్యోగాలను దశల వారీగా తగ్గించే ప్రణాళిక ఉన్నట్లు గతంలో వార్తలు వచ్చాయి.

# ఏటీఎం ఉచిత లావాదేవీలపై ఎస్‌బీఐ కొత్త రూల్స్




ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు షాకిచ్చింది (SBI ATM rules). ఎస్‌బీఐ డెబిట్ కార్డును ఉపయోగించి ఇతర బ్యాంకుల ఏటీఎంల నుంచి చేసుకునే ఉచిత నగదు ఉపసంహరణల పరిమితిని సవరించింది. దీన్ని 10 నుంచి 5కు తగ్గించింది. ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 1 నుంచే అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ ఖాతాదారులు ఇతర బ్యాంకుల ఏటీఎంలు, డిపాజిట్ కమ్ విత్‌డ్రా మెషిన్ల (ADWM) ద్వారా నెలకు మొదటి 10 లావాదేవీలను ఉచితంగా పొందుతున్నారు. కానీ, అక్టోబర్ 1 నుంచి ఉచిత పరిమితి కేవలం 5 లావాదేవీలకే పరిమితం కానుంది. ఆ తర్వాత జరిపే ఆరో ట్రాన్సాక్షన్ నుంచి ఛార్జీలు వసూలు చేయనుంది. ఇది ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలకూ వర్తిస్తుందని ఎస్‌బీఐ పేర్కొంది. అదనంగా చేసే ప్రతి ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్‌పై రూ.23 వసూలు చేయనుంది. దీనికి జీఎస్‌టీ అదనం. నాన్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లపై రూ.11+ జీఎస్‌టీ ఛార్జీలు ఉండనున్నాయి. ఈ కొత్త నిబంధనలు కేవలం ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు మాత్రమే. ఇతర ఎస్‌బీఐ ఖాతాదారులకు మాత్రం వర్తించదు. అదేవిధంగా ఎస్‌బీఐకి చెందిన సొంత ATM/ADWMలలో జరిపే డెబిట్ కార్డ్ లావాదేవీలపై ప్రస్తుత కొనసాగుతున్న పరిమితులు, ఛార్జీలే వర్తిస్తాయి. అందులో ఎలాంటి మార్పూ చేయలేదు.

# కేబుల్స్ మార్కెట్‌లోకి ఆదిత్య బిర్లా ఎంట్రీ.. ₹1800 కోట్ల పెట్టుబడులు

ఆదిత్యబిర్లా గ్రూప్ వైర్స్, కేబుల్స్ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది ఇందుకోసం రూ.1800 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు కంపెనీ పేర్కొంది. అల్ట్రాటెక్ సిమెంట్ విభాగం కింద అల్ట్రావోల్ట్ బ్రాండ్ పేరిట ఈ వ్యాపారాన్ని నిర్వహించనుంది. కాగా, గత మూడేళ్లలో ఈ గ్రూప్ కొత్తగా నాలుగో వ్యాపారాన్ని ప్రారంభించడం గమనార్హం. రానున్న ఐదేళ్లలో దేశంలోనే రెండో అతిపెద్ద వైర్ల తయారీ కంపెనీగా ఎదగాలని ఆదిత్య బిర్లా గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం గుజరాత్‌లో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ తయారుచేసిన ఉత్పత్తులను దేశవ్యాప్తంగా పంపిణీ చేయనుంది. ఈ విభాగంలో లక్షకు పైగా రిటైలర్లను చేరుకోవాలని భావిస్తోంది. అలాగే, 5 వేలకు పైగా ఉన్న అల్ట్రాటెక్ బిల్డింగ్ సొల్యూషన్స్ అవుట్‌లెట్‌ల ద్వారా 500కి పైగా జిల్లాలు, 6 వేలకు పైగా పిన్‌కోడ్‌లలో ఈ ఉత్పత్తులను అందుబాటులోకి తేనున్నారు. వైర్లు, కేబుల్స్ వ్యాపారం దేశంలో గ్రూప్ తదుపరి దశ అభివృద్ధికి బాటలు వేస్తుందని ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ మంగళం బిర్లా తెలిపారు.

# ఇంపాక్ట్‌గా కాదు.. పూర్తిస్థాయి ప్లేయర్‌గానే ధోని!

ఇంపాక్ట్ రూల్ వద్దు అని కొందరు..కావాలని మరికొందరు వాదిస్తున్నారు. దీనిపై ఇప్పటికే పది ఫ్రాంచైజీల కెప్టెన్ల అభిప్రాయాలను బీసీసీఐ తీసుకున్న సంగతి తెలిసిందే. వచ్చే సీజన్‌లో ఆ రూల్‌ను ఉంచుతారా? లేదా? అనేది బోర్డు నిర్ణయంపై ఆధారపడి ఉంది. ఒకవేళ ఇంపాక్ట్ రూల్‌ను తీసేస్తే ఎంఎస్ ధోని ఐపీఎల్ భవితవ్యం కూడా ఇబ్బందుల్లో పడుతుందనే వాదన వినిపిస్తోంది. గత సీజన్‌లో గాయం కారణంగా ఒక్క మ్యాచ్‌లోనూ అతడు ఆడలేదు. వచ్చే ఎడిషన్‌లో తప్పకుండా బరిలోకి దిగుతాడని సీఎస్‌కే అభిమానులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంపాక్ట్ రూల్ లేకపోతే పరిస్థితి ఏంటనేదీ పలువురిలో ఆందోళన కలిగిస్తోంది. అయితే, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాడు బద్రినాథ్ మాత్రం ధోని అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పాడు. ఐపీఎల్ 2027 సీజన్‌లో తలా తప్పకుండా ఆడతాడని వెల్లడించాడు. "ధోని (MS Dhoni) నాతో వ్యక్తిగతంగా ఓ మాట చెప్పాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా కాదు.. ఫుల్‌టైమ్ వికెట్ కీపర్‌గానే ఆడతానని అన్నాడు. దానర్థం 20 ఓవర్లూ అతడు మైదానంలో ఉంటాడు. ఒకవేళ నిజంగానే ధోని బరిలోకి దిగితే సీఎస్‌కేకు ప్రయోజనమే. కానీ, ధోని శరీరం అంత సమయం సహకరిస్తుందా? అనేది అనుమానం. గతంలో ఫ్లెమింగ్ ఇదే మాట అన్నట్లు గుర్తు. ధోని ఎక్కువగా 16 లేదా 17వ ఓవర్ తర్వాత బ్యాటింగ్‌కు వస్తుంటాడు. అతడి పాత్ర చాలా పరిమితంగానే ఉంటుంది" అని బద్రినాథ్ అన్నాడు.

**సీఎస్‌కేకు దూబే బౌలింగ్ అవసరంలేదు..**

"శివమ్ దూబే బౌలింగ్ భారత్‌కు అవసరం కానీ.. సీఎస్‌కేకు కాదు. అతడి విషయంలో ఇంపాక్ట్ రూల్‌ను వినియోగించాల్సిన పనిలేదు. అలాగే అకీల్ హుస్సేన్‌ను తప్పకుండా ప్లేయింగ్ XIలో ఉంచాలి. సీఎస్‌కే మాత్రం అతడిని ఇంప్టాక్‌గానే తీసుకొస్తోంది. ఒకవేళ బ్యాటింగ్‌లో




ఇబ్బంది పడినప్పుడు అదనంగా మరో బ్యాటర్‌ను తీసుకొంటోంది. దీంతో అకీల్ సేవలను కోల్పోయిన పరిస్థితులను మనం చూశాం. ఇక్కడ ఇంపాక్ట్ రూల్‌ను తప్పుబట్టేందుకు ఏమీ లేదు. సరిగ్గా వినియోగించుకొనే వ్యూహం ఆయా జట్లకే ఉండాలి" అని బద్రినాథ్ వ్యాఖ్యానించాడు.

# అన్ని జట్లూ ఇలానే చేస్తే బాగుండు.. పాక్ 'లింక్డిన్ పోస్టు'పై బట్లర్ సెటైర్!

పాకిస్థాన్ క్రికెట్ తీరు విమర్శలకు గురవుతూనే ఉంది. ఇంగ్లాండ్ చేతిలో ఘోర ఓటమి, ఏడుగురిపై వేటు వేయడంతో ఆ జట్టు మాజీలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇప్పుడు ఫీల్డింగ్ కోచ్ పదవి కోసం లింక్డిన్‌లో యాడ్ ఇవ్వడమూ సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురైంది. నెటిజన్లు తీవ్ర స్థాయిలో తమ కామెంట్లతో రెచ్చిపోయారు. ఈ క్రమంలో ఇంగ్లాండ్ ఆటగాడు జాస్ బట్లర్ కూడా కాస్త సెటైరికల్‌గా స్పందించాడు. అన్ని జట్లూ ఇలానే చేస్తే బాగుంటుందని పాక్‌పై వ్యంగ్యాస్త్రాలు గుప్పించాడు. "పాకిస్థాన్ ప్రకటనను సమర్థించడానికి ప్రయత్నిస్తున్నా. తమ కొత్త ఫీల్డింగ్ కోచ్ నియామకం కోసం పాక్ సంప్రదాయ, ఆధునిక వ్యూహాన్ని అనుసరించిందని అనుకుంటున్నా. అందుకోసమే లింక్డిన్‌లో పోస్టు చేసింది. ప్రస్తుత రోజుల్లో అన్ని జట్లూ ఇలాంటి జాబ్ ప్రకటనలు ఇవ్వాలి. ఇంగ్లాండ్ కూడా అదే చేస్తుందేమో నాకైతే తెలియదు" అని బట్లర్ వ్యాఖ్యానించాడు. పాకిస్థాన్ ఫీల్డింగ్ కోచ్‌గా షేన్ మెక్‌డార్మెట్ పదవీకాలం గత వారమే ముగిసింది. సాధారణంగా అధికారికంగా నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానించడం పరిపాటి. కానీ, లింక్డిన్‌లో పోస్టు చేయడం మాత్రం అభిమానులను




ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలని పాక్ బోర్డు ఆ పోస్ట్‌లో పేర్కొంది.




## 137 రన్స్ తేడాతో
# భారత్ ఘనవిజయం




దుబాయ్: మహిళల టీ20 ఆసియాకప్‌లో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 137 రన్స్ తేడాతో ఘన విజయం సాధించింది. 194 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన హాంకాంగ్.. 16.2 ఓవర్లలో 56 పరుగులకే ఆలౌటైంది. నటాషా మైల్స్ 15, మరీనా లంప్‌లాఫ్ 14 రన్స్ చేశారు. మిగిలిన బ్యాటర్లెవరూ అంతగా రాణించలేదు. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు.. ప్రేమ రావత్, నందనీ శర్మ, శ్రీచరణి తలో 2 వికెట్లు తీశారు. అంతకుముందు టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 193/5 పరుగులు చేసింది. స్మృతి మంధాన (124) శతకంతో విరుచుకుపడింది. షెఫాలీ వర్మ (28), ప్రతీక రావల్ (10), రిచా ఘోష్ (11), హర్మన్‌ప్రీత్ కౌర్ (10) పరుగులు చేశారు. హాంకాంగ్ బౌలర్లలో మరీనా 2, రుచితా వెంకటేశ్, జాయ్‌లీన్ కౌర్ ఒక్కో వికెట్ తీశారు.

# మళ్లీ వీవీఎస్ లక్ష్మణ్‌కే అవకాశం.. కేంద్రం ఆమోదం

మరో రెండు వారాల్లో మొదలయ్యే ఆసియా క్రీడల్లో టీమ్ఇండియా తలపడనున్న సంగతి తెలిసిందే. నేరుగా క్వార్టర్ ఫైనల్‌లో తలపడనుంది. జపాన్ వేదికగా ఈ క్రీడలు జరగనున్నాయి. అయితే, భారత జట్టుతోపాటు కోచ్‌గా వెళ్లేందుకు వీవీఎస్ లక్ష్మణ్‌కు మళ్లీ అవకాశం వచ్చింది. ఈ మేరకు కేంద్ర క్రీడల శాఖ ఆమోదం తెలిపింది. కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్ జాబితాలో వీవీఎస్ లక్ష్మణ్ పేరూ ఉంది. టీమ్ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ స్థానంలో లక్ష్మణ్ ఈ బాధ్యతలను నిర్వర్తిస్తాడు. దాదాపు అదే సమయంలో వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో భారత్ తలపడనుంది. అందుకే, గంభీర్ స్వదేశంలోనే ఉంటాడని బీసీసీఐ పేర్కొంది.

**లక్ష్మణ్ టీమ్ ఇదీ..**

ఆసియా క్రీడలకు లక్ష్మణ్ కోచ్‌గా వెళ్లడం ఇది వరుసగా రెండోసారి. 2023లో చైనా వేదికగా జరిగిన పోటీలకూ లక్ష్మణే మార్గదర్శకుడు. అప్పుడు టీమ్ఇండియా బంగారు పతకం నెగ్గింది. ఆ తర్వాత పలు సిరీస్‌లకూ గంభీర్ స్థానంలో లక్ష్మణ్ కోచ్‌గా వెళ్లాడు. ఈసారి ఆసియా క్రీడలకు తన కోచింగ్ బృందంలో మాజీ క్రికెటర్లు సునీల్ జోషి, హృషికేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్‌కు అవకాశం దక్కింది. మరూఫ్ ఫజందార్‌ను టీమ్ లీడర్‌గా కేంద్రం నియమించింది. ఇప్పటికే టీ20 జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తుండగా.. అతడికి డిప్యూటీగా తెలుగు కుర్రాడు తిలక్ వర్మ కు అవకాశం దక్కింది. ఇందులో వైభవ్ సూర్యవంశీ, జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఉన్నారు. ఆసియా క్రీడల్లో అతిపిన్న వయస్కుడైన క్రికెటర్‌గా వైభవ్ నిలిచాడు. మరోవైపు హెడ్ కోచ్ అమోల్ ముజుందార్, అవిష్కార్ సాల్వి నేతృత్వంలోనే భారత అమ్మాయిల జట్టు ఆసియా క్రీడల బరిలోకి దిగనుంది.





## అదే డేట్.. నో డౌట్

ఎన్టీఆర్ డ్రాగన్ వాయిదా పడనున్నట్లు వస్తోన్న రూమర్లపై మేకర్స్ తాజాగా రియాక్ట్ అయ్యారు. గాయం నుంచి కోలుకుంటున్న ఎన్టీఆర్ సెప్టెంబర్ మూడో వారం నుంచి షూటింగ్‌లో తిరిగి అడుగు పెట్టబోతున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ మూడో వారం నుంచి నాన్‌స్టాప్‌గా షూటింగ్ జరుపుతాం. వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా షూటింగ్ మొత్తం కంప్లీట్ చేస్తాం. చెప్పిన డేట్‌కు జూన్ 11న డ్రాగన్ థియేటర్లలోకి రాబోతుంది" అని తెలిపారు. ఎన్టీ ఆర్ సరసన రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోండగా అనిల్ కాపూర్, బిజు మీనన్ , గురు సోమసుందరం కీలక పాత్రల్లో నటి స్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవి శంకర్ నిర్మిస్తున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు రవి బస్రూర్ మ్యూజిక్ అందిస్తున్నారు.

## ఓటీటీలోకి
# ది ఇండియా స్టోరీ

కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన బాలీవుడ్ మూవీ ది ఇండియా స్టోరీ ఓటీటీలోకి వచ్చేస్తోంది. ఈనెల 25 నుంచి జీ5లో ఈ మూవీ స్ట్రీమింగ్ కానున్నట్లు వార్తలొస్తున్నాయి. హిందీతో పాటు తెలుగులోనూ రిలీజ్ కాబోతుంది. ఇందులో ఫెస్టిసైడ్స్ అధిక వినియోగం వల్ల దేశంలో పెరుగుతోన్న క్యాన్సర్ మరణాలపై పోరాటం చేసే మహిళా లాయర్‌గా కాజల్ కనిపించింది. కోర్టు రూమ్ డ్రామా థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమాకు చేతన్ డీకే దర్శకత్వం వహించాడు. శ్రేయస్ తల్పాడే కీలక పాత్రలో నటించాడు. జూలై నెలాఖరున థియేటర్లలో రిలీజైన ఈ మూవీకి విమర్శకుల ప్రశంసలు దక్కగా కమర్షియల్‌గా మాత్రం ఫెయిల్యూర్‌గా నిలిచింది. కాగా ప్రస్తుతం తెలుగులో బాలకృష్ణతో ఓ సినిమా చేస్తోంది. ఎన్‌బీకే 111 అనే వర్కింట్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమా డిసెంబర్ 25న థియేటర్లలోకి రాబోతుంది. ఈ మూవీకి గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు.



సినిమా



# రశ్మికే నంబర్ వన్

### దేశంలోనే అత్యధిక క్రేజ్ ఉన్న హీరోయిన్‌గా రికార్డ్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న కెరీర్‌లో మరో అరుదైన రికార్డును నెలకొల్పింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యధిక క్రేజ్ ఉన్న హీరోయిన్ల లిస్ట్‌లో నంబర్ వన్ ప్లేస్‌లో నిలిచింది. ఈ లిస్ట్‌లో దీపికా పడుకోణ్, సాయిపల్లవితో పాటు పలువురు హీరోయిన్లు రష్మిక తర్వాతే ఉండటం గమనార్హం. మూడ్ ఆఫ్ ది నేషన్ పేరుతో ఇండియా టుడే మ్యాగజైన్ క్రేజ్, స్టార్‌డమ్ పరంగా దేశంలోనే అత్యంత ప్రజాదరణ ఉన్న హీరోయిన్లు ఎవరనేదానిపై ఓ సర్వేను నిర్వహించింది. ఈ లిస్ట్‌లో రష్మిక మందన్నకు టాప్ ప్లేస్ దక్కింది. దీపికా పడుకోణ్ రెండో స్థానంలో నిలిచింది. సాహో హీరోయిన్ శ్రద్ధాకపూర్ మూడో స్థానం. నాలుగో ప్లేస్‌ను నాచురల్ బ్యూటీ సాయిపల్లవి దక్కించుకుంది. ఐదో స్థానం అలియాభట్‌కు దక్కింది. టాప్ ఫైవ్‌లో దక్షిణాది నుంచి రష్మికతో పాటు సాయిపల్లవి మాత్రమే ఉన్నారు.

# మల్టీస్టారర్ మూవీలో స్టెప్పులు

చాలా కాలం తర్వాత విక్టరీ వెంకటేష్ మూవీలో మిల్కీ బ్యూటీ తమన్నా స్పెషల్ సాంగ్‌లో కనిపించబోతోంది. వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో జనవరి 12 విడుదల పేరుతో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ మూవీలో స్టెప్పులేయనుంది. తనకు వరుసగా బ్లాక్‌బస్టర్స్ ఇచ్చిన అనిల్‌పై గౌరవంతో మరోసారి స్పెషల్ సాంగ్ చే యడానికి ఓకే చెప్పిందట. సెప్టెంబర్ నెలాఖరున వెంకటేష్, కళ్యాణ్ రామ్ తమన్నాలపై ఈ సాంగ్‌ను షూట్ చేయబోతున్నట్లు తెలిసింది. ఈ పాటలో అనిల్ గెస్ట్‌గా కనిపిస్తా డని టాక్. ఈ సినిమాలో కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. రా యలసీమ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ వచ్చే సంక్రాంతికి థియేటర్లలో సందడి చేయనుంది.





# రెమ్యూనరేషన్ తగ్గించిందట

టాక్సిక్ డిజాస్టర్‌తో హీరో యశ్ కంటే హీరోయిన్లపైనే ఎక్కువ ఎఫెక్ట్ పడుతోంది. ఈ ఫెయిల్యూర్‌తో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ తన రెమ్యూనరేషన్‌ను సగానికి తగ్గించినట్లు వార్తలు వస్తున్నాయి. ఒక్కో సినిమాకు ఐదు కోట్ల వరకు పారితోషికం తీసుకుంటుండగా ఈ ఫెయిల్యూర్తో తగ్గించిందట. రజనీకాంత్ ధర్మన్‌లో మొదట రుక్మిణిని ఓ హీరోయిన్‌గా అనుకోగా టాక్సిక్ రిజల్ట్ కారణంగా ఆమెను కాదని రాశీఖన్నాను ఆ రోల్ కోసం తీసుకున్నారు. మరో రెండు మూడు సినిమాలు దాదాపు ఓకే అవుతాయనే టైమ్‌లో చేజారిపోయాయి. కథ, తన పాత్ర బాగుంటే కోటి ఇచ్చినా కూడా సినిమా చేయడానికి రెడీ అని చెబుతోన్నట్లు టాక్ వినిపిస్తోంది.

# లగ్జరీ కారు కొన్న రణ్‌వీర్

ధురంధర్, ధురంధర్ 2 సక్సెస్‌లతో ఫుల్ జోష్‌లో ఉన్న బాలీవుడ్ హీరో రణవీర్‌సింగ్ ఓ లగ్జరీ కారును కొనుగోలు చేశాడు. ఈ జోష్‌లో హమ్మర్ బ్రాండ్‌కు చెందిన ఈ కారు ధర దాదాపు నాలుగు కోట్ల డెబ్బై ఐదు లక్షలకుపైగా వెచ్చించి కొన్నాడట. ఈ లగ్జరీ కారుతో ముంబైలోని ఓ ప్రొడక్షన్ ఆఫీస్‌కు రణవీర్ వచ్చిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. బాలీవుడ్‌లో హమ్మర్ ఈవీ కారును కొనుగోలు చేసిన సెకండ్ సెలిబ్రిటీగా ధురంధర్ హీరో నిలిచాడు.

